ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 3 జనవరి 2025

డీఎంహెచ్‌ఓగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ


డాక్టర్ పడాల రవికుమార్

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ పడాల రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్‌గా పనిచేస్తూ పదోన్నతిపై అనకాపల్లి డీఎంహెచ్‌ఓగా నియమితులయ్యారు. గత డీఎంహెచ్‌ఓ హేమంత్ ఆరు నెలల క్రితం పదవీ విరమణ చేయగా, అప్పటి నుంచి జిల్లా క్షయ, కుష్ఠు అధికారి బాలాజీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ప్రధాని రోడ్‌షో

8న విశాఖ సంపత్ వినాయక ఆలయం నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ వేదిక వరకూ నిర్వహణ

- రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు, నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కులకు శంకుస్థాపన చేయనున్న నరేంద్ర మోదీ
- సభకు లక్ష మంది హాజరవుతారని అంచనా
- ప్రధాని పర్యటన కార్యక్రమం పర్యవేక్షణకు ముగ్గురు మంత్రులతో కమిటీ
- నేడు ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రులు భేటీ




ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):

ప్రధాని నరేంద్రమోదీ ఈనెల ఎనిమిదో తేదీన విశాఖపట్నం రానున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. సభకు సుమారు లక్ష మందిని సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం... ఆశీల్‌మెట్టలో గల సంపత్ వినాయక్ ఆలయం వద్ద నుంచి సభా ప్రాంగణం వరకూ ఓపెన్‌టాప్ వాహనంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌లు రోడ్‌షోలో పాల్గొంటారు.


వేదిక వద్ద ప్రధానమంత్రి పలు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటుచేసే గ్రీన్ హైడ్రోజన్ పవర్‌ప్లాంటుకు కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. అలాగే నక్కపల్లి మండలంలో 2000 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,876.76 కోట్లతో ఏర్పాటుచేయనున్న బల్క్ డ్రగ్ పార్కు పనులను ప్రారంభిస్తారు. అదేవిధంగా నిర్మాణాలు పూర్తిచేసుకున్న దక్షిణ, తూర్పుభారతానికి చెందిన పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను ఈ వేదిక నుంచే జాతికి అంకితం చేస్తారు. కాగా ప్రధాని ఎయిర్‌పోర్టులోని ఐఎన్‌ఎస్ డేగాలో విమానం దిగిన తరువాత నేరుగా రోడ్డు మార్గాన నగరంలోకి రానున్నారు. తిరిగి ఎయిర్‌పోర్టుకు ... మిగతా 8వ పేజీలో

ప్రధాని పర్యటనపై కలెక్టర్ సమీక్ష

- హైడ్రోజన్ గ్రీన్ హబ్, బల్క్‌డ్రగ్ పార్కులకు విశాఖ నుంచి వర్చువల్‌గా మోదీ శంకుస్థాపన
- అచ్యుతాపురం, నక్కపల్లిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల ఎనిమిదో తేదీన అచ్యుతాపురం, నక్క పల్లి మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడ తారని, ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పలువురు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విశాఖపట్నంలో జరిగే సభలో ప్రధాని పాల్గొంటారని, ఈ సందర్భంగా అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు, నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అచ్యుతాపురంలో ఏర్పాట్ల బాధ్యతను అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయీషాకు, నక్కపల్లిలో ఏర్పాట్ల బాధ్యతలను నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణలకు అప్పగించారు. ఈ కార్యక్రమా నికి హాజరయ్యే ప్రజలకు రవాణా (బస్సులు), నదుపాయం, భోజన ఏర్పాట్ల బాధ్యతలను రవాణా, పౌరసరఫ రాలు, జిల్లా పంచాయతీ అధికారులకు అప్పగించి, ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆదేశించారు.


సబ్బవరం-షీలానగర్ రోడ్డు నిర్మాణం జరగనున్న ప్రాంతం ఇదే

సబ్బవరం-షీలానగర్ హైవేకు నిధులు

- రూ.963.93 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటన
- పనులు ఇక వేగవంతం
- ఆ రహదారి అందుబాటులోకి వస్తే సిటీ మధ్య నుంచి వెళ్లే నేషనల్ హైవేపై తగ్గనున్న భారీ వాహనాల రాకపోకలు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం-షీలానగర్ మధ్య ఆరు వరుసల జాతీయ రహదారి (516 సి) నిర్మాణానికి రూ.963.93 కోట్లు మంజూరు చేస్తున్నట్టు కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ గురువారం వెల్లడించారు. విశాఖపట్నం పోర్టుకు గాజువాక మీదుగా వచ్చే భారీ వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో వాటి రాకపోకలకు పోలీస్ అధికారులు నిర్ణీత సమయాలు కేటాయించారు. అయినా ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. దాంతో పోర్టు వర్గాలు ఈ సమస్య నివారణ కోసం అనకాపల్లి-ఆనందపురం ఆరు వరుసల జాతీయ రహదారిలో సబ్బవరం నుంచి షీలానగర్ వరకూ మరో ఆరు వరుసల జాతీయ రహదారి (516 సి) నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి 2023 అక్టోబరులోనే టెండర్లు పిలిచారు. ఈ రహదారి పొడవు 12.66 కి.మీ. ఇది పూర్తయితే అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు సబ్బవరం వద్ద ఏర్పాటుచేసే ఇంటర్ చేంజ్ వద్ద డైవర్షన్ తీసుకొని షీలానగర్ మార్గంలోకి వచ్చేస్తాయి. అక్కడి నుంచి విమానాశ్రయం పక్కనున్న మార్గంలో పోర్టుకు వెళతాయి. దీంతో నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారి(16)పై భారీ వాహనాల రాకపోకలు తగ్గుతాయి. దీనివల్ల ప్రమాదాల సంఖ్య కూడా తగ్గనుంది.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

రేపటి నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో అమలు

- సమీపంలోని ఉన్నత పాఠశాల భోజన పథకం నిర్వాహకులకు వంట బాధ్యత
- అక్కడి నుంచి కళాశాలకు భోజనం సరఫరా
- ప్రభుత్వ నిధులతో విద్యార్థులకు పళ్లాలు, గ్లాసులు
- జిల్లాలో ఆరు వేల మంది విద్యార్థులకు ప్రయోజనం


కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం కోసం సిద్ధం చేసిన పళ్లాలు, గ్లాసులు, పాత్రలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇకపై ఇళ్ల నుంచి మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాల్సిన అవసరంలేదు. పాఠశాలల తరహాలోనే జూనియర్ కళాశాలల్లో కూడా విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తున్నది. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల నాలుగో తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో సుమారు ఆరు వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

ప్రభుత్వ విద్యాలయాల్లో పలు సంస్కరణల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నది. ముఖ్యంగా పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నది. పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు చాలా ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే జూని యర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలు కావడంలేదు. ప్రభుత్వ కళాశాలల్లో పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు ఎక్కువగా చదువుతుంటారు. మండల కేంద్రాల్లో ఉండే ఈ కళాశాలలకు సుదూర గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. మధ్యాహ్నం భోజనాన్ని ఉదయాన్నే వెంట తెచ్చుకుంటుంటారు. వీరి ఇబ్బందులను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేసింది. గత ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఇదిలావుండగా సాధారణ ఎన్నికల ముందు యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రచేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ... మిగతా 8వ పేజీలో

తాండవ అత్యవసర పనులకు రూ.2.1 కోట్లు మంజూరు

గేట్లు, అక్విడక్టుల మరమ్మతు, కాలువల్లో పూడిక తీత

- వచ్చే ఖరీఫ్‌నాటికి పూర్తి
- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ


తాండవ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, ఈఈ బాలసూర్యం, అధికారులు, టీడీపీ నాయకులు

నాతవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్, పంట కాలువలకు అత్యవసర మరమ్మతు, నిర్వహణ పనులకు రూ.2.1 కోట్లు మంజూరైనట్టు తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన తాండవ ప్రాజెక్టు ఈఈ బాలసూర్యంతో కలసి రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, తాండవ రిజర్వాయర్‌కు సంబంధించి వచ్చే ఖరీఫ్‌నాటికి 18 పనులను అత్యవసరంగా చేయాలని గుర్తించినట్టు చెప్పారు. ప్రాజెక్టు మెయిన్ గేట్లు, అక్విడక్టులకు మరమ్మతులు, ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు చేస్తామని తెలిపారు. తాండవ నీటి సంఘాల అధ్యక్షులతో త్వరలో సమావేశమై ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలో గుర్తించి, ప్రతిపాదనలు తయారు చేస్తామని తెలిపారు. నిధుల విడుదల కోసం ఈ ప్రతిపాదనలను స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తాండవ మెయిన్ గేట్లు, స్పిల్‌వే గేట్లు వద్ద జనరేటర్ పనితీరు ... మిగతా 8వ పేజీలో

తాబేళ్ల మృత్యువాత

రాంబిల్లి మండలంలో సముద్ర తీరానికి కొట్టుకువచ్చిన కళేబరాలు

- కాటేస్తున్న ఫార్మా కంపెనీలు, పరిశ్రమల వ్యర్థాలు
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు


కొత్తపట్నం తీరంలో మృతిచెందిన తాబేలు


తాబేళ్ల కళేబరాలను పరిశీలిస్తున్న మత్స్యకారులు

రాంబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపట్నం సముద్ర తీరానికి తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. సుమారు కిలో మీటరు పరిధిలో 40-45 వరకు తాబేళ్ల కళేబరాలు కనిపించాయి. ఈ దృశ్యాలను చూసి మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫార్మా కంపెనీలు, సెజ్‌లోని పలు ఇతర పరిశ్రమలు వ్యర్థాలను పూర్తిస్థాయిలో శుద్ధిచేయకుండా గెడ్డల్లోకి విడిచిపెడు తున్నారని, దీనివల్ల సముద్ర జలాలు కలుషితమై తాబేళ్లు, ఇతర మత్స్య సంపద మృత్యువాత పడుతున్నాయని ఆరోపించారు. గతంలో అప్పుడప్పుడు ఇలా మృత తాబేళ్లు ఒకటీఅరా ఒడ్డుకు కొట్టుకువచ్చేవని, కానీ ఇంతపెద్ద సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కొట్టుకురావడం మొదటిసారే చూస్తున్నామని కొత్తపట్నం, వాడనర్సాపురం, వాడపాలెం, లోవపాలెం గ్రామాల మత్స్యకారులు చెబుతున్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఏర్పాటైన సెజ్‌లోని కంపెనీలు, పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా సముద్రములోకి వదిలేయడం వల్ల మత్స్యసందతో పాటు తాబేళ్లు మృతిచెందుతున్నాయి. రానురాను ఈ సమస్య పెరిగిపోతున్నది. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే సముద్ర తాబేళ్లు ఈ ప్రాంతంలో అంతరించే ప్రమాదం వుంది.

- **చోడిపల్లి మంగరాజు,** ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నర్సీపట్నం కమిషనర్‌పై చైర్‌పర్సన్ ఫిర్యాదు

- ఏకపక్షంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించారని ఆరోపణ
- శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి,కౌన్సిలర్లు

నర్సీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ అయ్య న్నపాత్రుడు నర్సీపట్నం మునిసిపల్ పాలకవర్గం ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయ నున్న సమాచారాన్ని కమిషనర్ ముందుగా తెలియపరచలేదని, పైగా కౌన్సిల్ సమావేశాన్ని ఏకపక్షంగా నిర్వహించారని చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆరోపించారు. ఈ మేరకు గురువారం వైసీపీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. డిసెంబరు 31వ తేదీన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి ... మిగతా 8వ పేజీలో

Government of Andhra Pradesh
Endowments Department
E-PROCURMENT TENDER NOTICE

Re Construction of Compound wall of **Sri Bramarambika Mallikarjuna Swamy Temple** at M.J.Puram (V), Atchuthapuram (M), Anakapalli District. NIT No. P/COE/268/2024-59, Dt.22.02.2024. For further details log onto website **"https://tender.apeprocurment.gov.in"** for further details contact Ph.9110357800.

EXECUTIVE OFFICER
Sri Bramarambika Mallikarjuna Swamy Temple
M.J.Puram (V), Atchuthapuram (M),
Anakapalli District.

నేటి నుంచి పద్మాపురం గార్డెన్ మూసివేత

- ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు తొమ్మిది రోజుల పాటు ప్రవేశాలు నిలిపివేత



అరకులోయ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో ప్రముఖ పర్యాటక కేంద్ర మైన పద్మాపురం గార్డెన్‌ను ఈ నెల 3 నుంచి 11వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మాపురం గార్డెన్‌ను మరింత సుందరంగా తయారు చేయడానికి ఆధునికీకరణ పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఈ తొమ్మిది రోజులు గార్డెన్‌ను తిలకించడానికి పర్యాటకులను అనుమతించబోమని, ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.


అట్టహాసంగా నేవీ విన్యాసాల ప్రదర్శన


బాంబులు వేస్తున్న పీ8 యుద్ధ విమానం

- రిహార్సల్స్‌లో అపశ్రుతి...
- పట్టు తప్పి పడిపోయిన ఇద్దరు పారాట్రూపర్లు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ సాగర తీరంలో గురువారం సాయంత్రం తూర్పు నౌకాదళం సాహస విన్యాసాల ప్రదర్శన అట్టహాసంగా జరిగింది. ఈ నెల 4వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎదుట విన్యాసాల ప్రదర్శన జరగనుంది. దీనికి రిహార్సల్‌గా గురువారం సాయంత్రం అన్నిరకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లేజర్ షో, డ్రోన్ల ప్రదర్శన నగరవాసులను అలరించాయి. ఆకాశంలో ఎగురుతున్న హెలికాప్టర్ నుంచి పారాచ్యూట్ సాయంతో కిందకు సురక్షితంగా దిగే విన్యాసం ప్రదర్శించారు. అయితే మొత్తం నలుగురిలో ఇద్దరు క్షేమంగా కిందకు రాగా, మిగిలిన ఇద్దరు పట్టు తప్పి ఒకరి పారాచ్యూట్ మరొకరి దానికి ముడిపడి సముద్రంలో పడిపోయారు. వెంటనే నేవీ సిబ్బంది జెమినీ బోట్లలో అక్కడకు వెళ్లి పారాట్రూపర్లు ఇద్దరినీ రక్షించారు. ...మరిన్ని ఫొటోలు 8లో

అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి అర్జున అవార్డు



విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి క్రీడారంగంలో అత్యుత్తమ పురస్కారం లభించింది. అత్యంత వేగవంతమైన స్ప్రింటర్‌గా గుర్తింపు పొందడమే కాకుండా ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొన్న తొలి భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పిన ఆమెను కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డుతో గౌరవించనున్నది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సత్తా చాటుతూ అంతర్జాతీయ పతకాలు అందించిన జ్యోతికి ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు దక్కింది. ఈనెల 17న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జ్యోతి అవార్డును అందుకోనుంది.



విశాఖ డెయిరీ నగదు బదిలీ చెక్కుల పంపిణీ



పాడి రైతులకు చెక్కులు అందజేస్తున్న విజయకుమార్, రమాకుమారి

ఎలమంచిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పాడి రైతులకు రూ.8.5 కోట్ల నగదు బదిలీ చెక్కులను గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, విశాఖ డెయిరీ డైరెక్టరు పిల్లా రమాకుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విశాఖ డెయిరీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో అమూల్ డెయిరీకి ప్రాధాన్యతనిచ్చిందని ఆరోపించారు. విశాఖ డెయిరీ డైరెక్టరు రమకుమారి మాట్లాడుతూ దివంగత డెయిరీ చైర్మన్ తులసీరావు అనునిత్యం పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా సేవలందించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి టీడీపీ ముఖ్య నేతలు ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. పరమేశ్వరావు, జిల్లా ప్రతినిధి వర్మ, డెయిరీ డైరెక్టర్లు, బీజేపీ, జనసేన నేతలు, రైతులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

రాంబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని హైందవ సంఘాల నాయకులు చింతకాయల ఎర్రయ్య, సూరాడ నూకరాజు, చింతకాయల కోదండరావు, కారే నాని పిలుపునిచ్చారు. గురువారం వారు వాడనర్సాపురంలో, కొత్తపట్నం, చినకలవలాపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, కేజీపాలెం తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లౌకిక రాజ్యంలో ప్రార్థనా స్థలాలు, ఆస్తుల విషయంలో ఇతర మతాలకు విపరీతమైన స్వేచ్ఛను ఇస్తూ అదే సమయంలో అత్యధిక వర్గానికి చెందిన హిందువుల ఆలయాలపై మాత్రమే ప్రభుత్వ నియంత్రణ ఉండడం తీవ్రమైన ఆక్షేపణీయమన్నారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల అజమాయిషీ పూర్తిగా తొలగించేంతవరకు తాము చేపట్టిన ఉద్యమం ఆగదన్నారు.

అయ్యన్నపాత్రుడును కలిసిన రంగనాయకులు



స్పీకర్ అయ్యన్నపాత్రుడును సత్కరిస్తున్న ధూళి రంగనాయకులు, తదితరులు

రాంబిల్లి, జనవరి 2 (ఆంధ్రప్రదేశ్): రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని గురువారం నర్సీపట్నం లోని ఆయన నివాసంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు యాదవ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ అయ్యనపాత్రుడు ఆశీస్సులు తీసుకున్నాన న్నారు. ప్రభుత్వం ఇచ్చిన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారన్నారు. ఆయన వెంట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, నేతలు గొలగాన అప్పారావు, తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు కోన అప్పలనాయుడులు ఉన్నారు.

వాడ్రాపల్లి సర్పంచ్‌ను పరామర్శించిన వైసీపీ నేతలు

మునగపాక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజును మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ గురువారం పరామర్శించారు. అనారోగ్యం బారిన పడిన నూకరాజు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇటీవల వైద్య చికిత్స పొందిన అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు కొయిలాడ దశావతారంను కూడా పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు, కె.జగన్, ఎస్.సూర్యనారాయణ ఉన్నారు.

కాలుష్యంతోనే తాబేళ్లు మృతి : సీపీఎం

రాంబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సెజ్‌లోని పరిశ్రమల వ్యర్థజలాలను సముద్రంలోకి వదిలేయడం వలనే తాబేళ్లు, చేపలు మృతి చెందుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, ఏపీ మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చోడిపల్లి మంగరాజు అన్నారు. గురువారం వారు కొత్తపట్నం సముద్రతీరం వద్ద మృతి చెందిన సముద్ర తాబేళ్ల కళేబరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ పరిధిలోని ఫార్మా కంపెనీల నుంచి విష జలాలు సముద్రాన్ని కలుషితం చేస్తున్నాయని, దీనివల్లే పెద్ద సంఖ్యలో తాబేళ్లు, చేపలు మృతి చెందుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్, పర్యావరణ శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట మత్స్యకారులు అప్పలరాజు, పెంటయ్య, అమ్మోరయ్య, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి'



అల్లూరి విగ్రహం వద్ద సీపీఎం నేతల నిరసన

ఎస్.రాయవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగరాజుపాలెంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, ఎం.రాజేష్ అన్నారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి ధ్వంసమైన అల్లూరి విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో దండు గణపతిరాజు, సాంబరాజు, వెంకటశివ, కె. శ్రీను, హరి, అంజి, మహేష్, నాగేష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడి మృతి

పాయకరావుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాకాలనీ సమీపంలో గురువారం ఉదయం రైలు నుంచి గుర్తు తెలియని యువకుడు జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాయకరావుపేటలోని ఇందిరాకాలనీ సమీపంలో గురువారం ఉదయం తుని నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న రైలు నుంచి సుమారు 21 సంవత్సరాల వయస్సు గల యువకుడు జారిపడి మృతిచెందాడన్నారు. అతను ఎరుపురంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీ రూమ్‌లో భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో లేదా ఫోన్ నంబరు 94906 19020లో సంప్రతించాలని తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ తెలిపారు.

అన్నదాతలకు తప్పని అవస్థలు

- వరి కుప్పలు వేసిన వారికి తిప్పలు
- పనలు ఆరకుండా వేయడంతో ఇబ్బందులు
- కుప్పల నుంచి వస్తున్న ఆవిరులు
- పనలను ఎండబెడుతున్న రైతులు
- కూలీల ఖర్చులు పెరిగాయని ఆవేదన

పాయకరావుపేట రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి కుప్పలు వేసిన చాలామంది రైతులకు తిప్పలు తప్పడం లేదు. గత నెలలో అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో వరి పనలు ఆరకుండా హడావిడిగా వరి కుప్పలు వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కుప్పల నుంచి ఆవిరి వస్తుండడంతో వాటిని విడదీస్తున్నారు. మండలంలోని సత్యవరం, పెదరాంభద్రపురం, గోపాలపట్నం, పెంటకోట, గుంటపల్లి తదితర గ్రామాలలో డిసెంబరు నెలలో ఏర్పడిన అల్పపీడనాలకు ముందే అధిక శాతం రైతులు వరి కోతలు కోశారు. తరువాత ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ, అధికారులు హెచ్చరించడంతో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామనే భయంతో చాలా మంది రైతులు ఆదరాబాదరాగా వరి పనలు ఆరకుండానే కుప్పలను వేశారు. కానీ అప్పటికే తుంపర చినుకులు పడినా రైతులు కుప్పలను వేసేశారు. చాలాచోట్ల పనలు ఆరకుండా వేసిన కుప్పలు గాలిబారక కుళ్లిపోయి ధాన్యం రంగుమారే పరిస్థితి ఉండడంతో రైతులు కుప్పలను విడదీసి ఆరబెట్టి తిరిగి కుప్పలు వేస్తున్నారు. దీంతో ఖర్చులు పెరిగిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. పొలానికి ట్రాక్టరు వెళ్లడానికి అవకాశం ఉన్న కొంతమంది రైతులు ధాన్యం రంగు మారిపోతాయనే భయంతో కుప్పలను నూర్పిడి చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో సత్యవరం, పెంటకోట, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, మంగవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం తదితర గ్రామాలలో పంట బాగా పండింది. మంచి దిగుబడులు వస్తాయని రైతులు, వ్యవసాయాధికారులు ఆశాభావంతో ఉన్నారు. అయితే పంట చివరి దశలో కోతలు కోసే సమయంలో, వరి పనలు పొలంలో ఉన్న సమయంలో అల్పపీడనాలు రైతులను ఆందోళనకు గురి చేశాయి. కొద్దిపాటి తుంపర్ల వర్షంతో గండం గట్టెక్కిందని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ కుప్పలు నుంచి ఆవిరి రావడంతో కొంతమంది రైతులు ఆందోళనలో ఉన్నారు.



గుంటపల్లి ఆవ ప్రాంతంలో వేసిన వరి కుప్పలను విడదీస్తున్న రైతులు

పింఛన్ల పంపిణీపై విచారణ

- పలు గ్రామాల నుంచి ఐవీఆర్ఎస్‌కు ఫిర్యాదులు
- 32 మందిని విచారించిన అధికారులు
- తాము ఫిర్యాదు చేయలేదన్న పింఛన్‌దారులు



మాసాహెబ్‌పేటలో పింఛన్ల పంపిణీ ఫిర్యాదుపై విచారిస్తున్న అధికారులు

పాయకరావుపేట రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో పెన్షన్ల పంపిణీ చేసినపుడు డబ్బులు తీసుకుంటున్నారని ఐవీఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు గురువారం మండల అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని సత్యవరం, మాసాహెబ్‌పేట, గుంటపల్లి, రాజవరం, వెంకటనగరం, పాల్మన్‌పేట, పాల్తేరు, ఎస్.నర్సాపురం, మంగవరం, పీఎల్.పురం, నామవరం, శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, గోపాలపట్నం, తదితర పంచాయతీలలో పింఛన్ల పంపిణీలో డబ్బులు తీసుకుంటున్నారని ఐవీఆర్ఎస్‌కు 32 ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ నిర్వహించాలని జిల్లా కలెక్టరు విజయ్‌కృష్ణన్ ఆదేశించడంతో మండల ప్రత్యేకాధికారిణి జీవీ. లక్ష్మి, ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు, తహసీల్దారు జి. సత్యనారాయణ, ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖరరావు గురువారం ఆయా గ్రామాలలో విచారణ నిర్వహించారు. అయితే తాము ఎవరికీ ఫిర్యాదు చేయలేదని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు చెప్పారని ఈవోపీఆర్డీ చంద్రశేఖరరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- అధికారులను నిలదీసిన సభ్యులు... ▸ వాడీవేడిగా 'పేట' మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ అధికారులు

పాయకరావుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):గత మండల సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కరించకుంటే సమావేశాలు నిర్వహించడం ఎందుకని పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. గురువారం మండల పరిషత్ సమావేశ హాల్లో ఎంపీపీ పార్వతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ శాఖల వివరాలు తెలియజేస్తున్న సమయంలో పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత సమావేశంలో చర్చించిన అంశాల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలు కూడా పరిష్కారానికి నోచుకోలేదని, అలాంటప్పుడు సమావేశాలు ఎందుకని శ్రీరాంపురం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, మాసాహెబ్‌పేట ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్ తదితరులు నిలదీశారు. అధికారులు స్పందించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ముఖ్యంగా సాగునీటి కాలువల గేట్లు మరమ్మతులు చేపట్టాలని, రోడ్ల ఆక్రమణలను తొలగించాలని, సారా విక్రయాలు, బెల్ట్‌షాపులు నియంత్రించాలని, పెంటకోట, పాల్మన్‌పేట గ్రామాల వరకు ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటుచేయాలని, తీర ప్రాంతంలో సరుగుడు తోటలకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో సీహెచ్‌ఆర్‌కే.వర్మ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపడతారన్నారు. వచ్చే సమావేశంలో పనుల పురోగతిని సభ్యులకు తెలియజేసేలా అధికారులు కృషిచేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి 16వ ఆర్థికం సంఘం నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో సమస్యలు గుర్తించి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈనెలాఖరులోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ-2 పల్లెల మణికంఠస్వామి, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వరాహావతారంలో పాండురంగడు



వరాహావతారంలో దర్శనమిస్తున్న పాండురంగడు

పాయకరావుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) :దశావతారాల్లో భాగంగా పట్టణంలోని రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి గురువారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పాండురంగస్వామికి విశేష పూజలనంతరం ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి వరహావతారంలో అలంకరించారు. ఆండాళ్ళమ్మవారికి విశేషాలంకరణ, నివేదన, ప్రత్యేక పూజలు నిర్వహించగా.. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మంచు ముసుగులో అచ్యుతాపురం

అచ్యుతాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో గురువారం ఉదయం భారీగా మంచు కురిసింది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అచ్యుతాపురంలో గల అపార్టుమెంట్లపై మంచు ముసుగేసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు కురుస్తునే ఉంది. దీంతో వాహన చోదకులు తమ వాహనాల లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. సెజ్ కర్మాగారాల్లో మొదటి షిఫ్ట్‌లకు వెళ్లే బస్సులు, వాహన చోదకులు మంచు కారణంగా రోడ్డు సక్రమంగా కనబడక ఇబ్బందులు పడ్డారు. ఉదయం తొమ్మిదిన్నర దాటిన తర్వాత సూర్యుడు మంచు తెరలను చీల్చుకొని వచ్చాడు.



అచ్యుతాపురంలో కురుస్తున్న మంచు

ఉప్పుగల్లీల వద్ద బ్రాండిక్స్ బస్సులను ఆపేసిన డ్రైవర్లు



బస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న బ్రాండిక్స్ అధికారులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అధిష్టాన్ (బ్రాండిక్స్) కంపెనీ బస్సులను పూడిమడక ఉప్పు గల్లీల వద్ద నిలిపివేయడంపై మహిళా ఉద్యోగులు గురువారం ఉదయం నిరసన వ్యక్తం చేశారు. అధిష్టాన్ కంపెనీ పరిధిలోని బ్రాండిక్స్ కంపెనీలకు మహిళా ఉద్యోగులను ఏ షిఫ్ట్ డ్యూటీకి తీసుకుని వెళ్లే బస్సులు గురువారం ఉదయం గ్రామంలోకి వెళ్లకుండా కిలోమీటరు దూరంలో గల ఉప్పుగల్లీల వద్ద డ్రైవర్లు నిలిపివేశారు. కిలోమీటరు దూరం నడిచి రావాలని బస్సు డ్రైవర్లు కబురు పంపడంపై వారు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి బస్సులు వస్తేనే తాము కంపెనీకి వస్తామని చెప్పడంతో గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో కంపెనీ హెచ్‌ఆర్ ఉద్యోగులు సంఘటనా స్థలానికి వచ్చి ఉద్యోగులతో మాట్లాడి ఇకపై ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని చెప్పి వారిని బస్సులోకి ఎక్కించారు. ఆటోలు గ్రామంలో రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారని, ఒకవేళ తమ వాహనాలు తగిలితే గ్రామంలో ఘర్షణలు వస్తాయని, తాము గ్రామంలోకి వెళ్లకుండా నిలిపివేశామని బస్సు డ్రైవర్లు చెబుతున్నారు.

కృష్ణంపాలెం గ్రామాన్ని తరలించాలి



ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కృష్ణంపాలెం గ్రామస్థులు

రాంబిల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపాలెం గ్రామాన్ని తరలించాలని గ్రామ మాజీ సర్పంచ్ కశిరెడ్డి ప్రసాద్, పలువురు గ్రామస్థులతో కలిసి గురువారం రాంబిల్లి వచ్చిన అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా బేగమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీలో గత ప్రభుత్వాలు 80శాతం భూసేకరణ చేసిందని, మిగతా 20 శాతం కుటుంబాలు వారు గ్రామాన్ని ఆనుకొని ఉన్న కంపెనీల నుంచి విషవాయువులతో అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. గాలి, నీరు కలుషితమై పలు రకాల చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలకు గురవుతూ.. ఆసుపత్రుల పాలవుతూ ఆర్థికంగా ఇబ్బందుకు గురవుతున్నారన్నారు. కంపెనీల కాలుష్యంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, తమ గ్రామాన్ని తరలించి, గ్రామస్థులను ఆదుకోవాలని ఆర్డీవో షేక్ ఆయేషా బేగమ్‌ను వేడుకున్నారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు.

పల్లకీపై పద్మావతి ప్రియుడు



నక్కపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉపమాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం పెద్ద పల్లకీపై స్వామివారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు తదితరులు నిత్య హోమం నిర్వహించారు. అనంతరం పెద్ద పల్లకీలో ఉభయదేవేరులతో వేంకటేశ్వరస్వామివారు, చిన్న పల్లకీలో గోదాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించి మాడ వీధుల్లో తిరువీధి సేవను నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, పవన్‌కుమార్, జ్ఞానప్రమోద్, సింగరాచార్యులు, తాతాజీ, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

సాగు భూములకు నష్టపరిహారం చెల్లించాలి

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు రైతుల వినతి



ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో మండలంలో సేకరిస్తున్న సాగు భూములకు నష్టపరిహారం చెల్లించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో మండలంలోని రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డీఎల్.పురం గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో సేకరిస్తున్న భూముల్లో సాగు భూములకు నష్టపరిహారం చెల్లించకుండా అధికారులు సర్వేలు పేరు చెప్పి కాలయాపన చేస్తున్నారని వాపోయారు. దీనిపై జోనల్ మేనేజర్ స్పందిస్తూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకునివెళ్లి భూములకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.రాజేష్, రైతులు ఆర్.గోవిందు, టి.ప్రసాద్, ఎం.బైరాగి, మాధవస్వామి, సీహెచ్.రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఎలమంచిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి రైతులంతా దళారులను నమ్మకుండా రైతు సేవా కేంద్రాలల్లో విక్రయించాలన్నారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు మండల కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, నూర్పిడి చేయదలచుకున్న రైతులు షెడ్యూలింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కూటమి నేతలు శ్రీరామదాసు, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, యల్లపు గోపి, చిట్టిబాబు, ఏవో మోహనరావు, ఏఈఓ దేముళ్లు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్‌పై వీఎంఆర్‌డీఏ అధికారుల విచారణ



అక్రమ లేఅవుట్‌లో విచారణ చేస్తున్న వీఎంఆర్‌డీఏ అధికారులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 2, (ఆంధ్రజ్యోతి):పూడిమడక రెవెన్యూ పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్‌ను నిలిపివేయాలని చేసిన ఫిర్యాదుపై వీఎంఆర్‌డీఏ అధికారులు గురువారం విచారణ జరిపారు. పూడిమడక గ్రామ పరిధిలోని 127, 86, 126 సర్వే నంబర్ల పరిధిలో గల 6 ఎకరాలలో కొందరు అక్రమ లేఅవుట్ వేశారని, తగిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేశానని జాతీయ మత్స్యకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎరిపిల్లి కాసులు (కిరణ్) తెలిపారు. తన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ స్పందించి వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉందని చెప్పడంతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. దీంతో గురువారం వీఎంఆర్‌డీఏకు చెందిన డీడీ శ్రీనివాస్, టీపీఓ సూర్యనారాయణ, ఎస్‌డీఎం జ్యోతిలు విచారణ చేపట్టారు. విచారణ జరిపి పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వారు తెలిపారు.

ఆటో, మోటారు కార్మికుల నిరసన

ఎలమంచిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆటో, మోటారు వాహనాల లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు పరం చేయవద్దని కోరుతూ పట్టణంలోని ప్రధాన రోడ్డుపై గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో,మోటారు రంగ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న విధానాల కారణంగా ఆటో,మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వలన కార్మికులపై మరింత భారం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో, మోటారు రంగ కార్మికులు ఎం. శ్రీనివాస్, ఏ.నాయుడు, ఎస్.లోవరాజు, అనిల్, నాగేశ్వరావులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టోర్నీలో హేమచంద్రన్ పతకం

ఎలమంచిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాడ్మింటన్ టోర్నీలో ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్. హేమచంద్రన్ డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించినట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.పోలినాయుడు తెలిపారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 23 నుంచి 26 వరకూ నేపాల్ దేశం ఖాట్మండులో జరిగిన సన్‌రైజ్ నేపాల్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలో డిగ్రీ విద్యార్థికి డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ వచ్చిందని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కుమారస్వామి



ఎలమంచిలి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా అగ్రహారపు కుమారస్వామిని నియమించినట్టు ఎన్నికల అధికారి జేవీఎస్.రాజు తెలిపారు. బీజేపీ నేతలు బీవీఎస్. వర్మ, సీవీ. రాజు, కె. సత్యనారాయణ, తదితర నేతల సమక్షంలో కుమారస్వామిని మండల అధ్యక్షుడిగా నియమించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మార్టూరు రోడ్డులో భారీ గొయ్యి పూడ్చివేత

అచ్యుతాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్టూరు రోడ్డులో ప్రయాణించే వాహన చోదకులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ రోడ్డులో అయ్యప్ప స్వామి ఆలయం దాటిన తర్వాత భారీ గొయ్యి ఏర్పడింది.

దీంతో ఇక్కడ చాలా మంది వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు. అలాగే రాంబిల్లి మండలంలోని వివిధగ్రామాలకు చెందిన వారు ఈ రోడ్డు గుండా ప్రయాణించేవారు. వీరి ఇబ్బందిని గమనించిన అచ్యుతాపురం సర్పంచ్ విమల కుమారి గురువారం రాళ్లతో గొయ్యిని పూడ్చిన తర్వాత గ్రావెల్‌ను వేసి ఎక్సకవేటర్‌తో కప్పించారు. దీంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

హైందవ శంఖారావానికి స్పీకర్‌కు ఆహ్వానం



అయ్యన్నపాత్రుడుకు ఆహ్వాన పత్రిక అందజేసిన నిర్వాహకులు

నర్సీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్, ధార్మిక సంఘాలు విజయవాడలో ఈ నెల ఐదో తేదీన నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు హాజరు కావలని స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కట్టమూరి శేఖర్ కోరారు. ఈ మేరకు గురువారం అయ్యన్నను ఇక్కడి తమ స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు డాక్టర్ వి.రామచంద్రరాజు, అరవింద్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'కళాకారులతో పథకాలు ప్రచారం చేయించండి'

నర్సీపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారాలను ఎల్ఈడీ స్ర్కీన్‌లతో కాకుండా కళాకారులు ప్రచారం చేసే అవకాశం కల్పించాలని ప్రభుత్వ పథకాల ప్రచార కళాకారుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యడవల్లి వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం ఇక్కడ స్పీకర్ అయ్యన్నపాత్రుడును కలిసి మాట్లాడారు. కళాకారులకు పథకాలు ప్రచారం చేసే అవకాశం కల్పించి తద్వారా ఉపాధి చూపాలని విన్నవించారు. అలాగే, గ్రామ సభలలో తమ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కె.కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, గణేశ్ పాల్గొన్నారు.

'నాతవరంలో రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం'

నాతవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నాతవరంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాల మేరకు రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కానుందని మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు ఎన్.విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ ఏడాది నాతవరంలో కాకుండా వైడీపేట గ్రామంలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారని, దీనివల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అయ్యన్న దృష్టికి తీసుకు వెళ్లడంతో ఈ మేరకు ఆయన చర్యలు చేపట్టారన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించాలి

మూడు మండలాల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

నర్సీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వాటి సేవలపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు సూచించారు. గురువారం ఇక్కడ నర్సీపట్నం, రోలుగుంట, గొలుగొండ మండలాల రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ధాన్యాన్ని తీసుకు వచ్చే ప్రతి రైతుకు మద్దతు ధర వచ్చేలా చూడాలన్నారు. అలాగే, బహిరంగ మార్కెట్లో అమ్ముకునే రైతుల వివరాలు కూడా నమోదు చేయాలని ఆదేశించారు. రబీ ఇ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతుల దగ్గర నుంచి పంటన వివరాలు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు బ్యాంక్ అధికారులతో సంప్రదించి పంట రుణాలు ఇప్పించేలా చూడాలని పేర్కొన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు వెరిఫికేషన్ చేసి పోర్టల్‌లో పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి, మండల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు

గంజాయి రవాణా కేసుల్లో179 మంది అరెస్టు

గత ఏడాది క్రైమ్ రేటు వివరాలు వెల్లడించిన డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : సబ్ డివిజన్‌లో 2024 సంవత్సరంలో 64 కేసులలో 1883 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, 179 మందిని అరెస్టు చేసి రూ.11,17,120 నగదును సీజ్ చేశామని డీఎస్పీ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాట స్థావరాలపై దాడులు చేసి 140 కేసులు నమోదు చేసి 667 మందిని అరెస్టు చేశామని, రూ.13,49329 నగదు సీజ్ చేశామని వివరించారు. అలాగే, 101 కోడి పందేల కేసులలో 293 మందిని అరెస్టు చేసి 1,08,063 నగదు సీజ్ చేశామని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిపై 3226 కేసులు, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నవారిపై 893 కేసులు నమోదు చేశామని ఆయన స్పష్టం చేశారు.



డీఎస్పీ మోహన్

'చమ్మచింతలో పీసా చట్టం అమలు తగదు'



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నాతవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చమ్మచింతలో ఒక్క గిరిజనుడు కూడా లేడని, కానీ ఈ గ్రామంలో అధికారులు పీసా చట్టం ఎలా అమలు చేస్తారని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కాశపు నూకరాజు ప్రశ్నించారు. గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమ చమ్మచింతలో 2022 నుంచి పీసా చట్టం అమలు చేస్తున్నారని, గిరిజనులు లేకుండా చట్టం అమలు చెయ్యడం అన్యాయమన్నారు. ఈ గ్రామంలో 1978 వరకు భూముల రిజిస్ట్రేషన్లు జరిగేవని, ఆ తర్వాత 1/70 యాక్టు అమలు చేస్తున్నారని చెప్పారు. దీనివలన గిరిజనేతరులకు భూములు రిజిస్ట్రేషన్ అవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి ఇక్కడ పీసా చట్టం అమలును నిలిపి వేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, విజయ్ పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

నర్సీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 75 రోజులకు రూ.5,38,145ల ఆదాయం వచ్చినట్టు ఈవో సాంబశివరావు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలీసు, సేవా సిబ్బంది సమక్షంలో హుండీ లెక్కింపును చేపట్టామని ఆయన వివరించారు.

పాఠశాలల అభివృద్ధికి సమష్టి కృషి చేయండి



శిక్షణ శిబిరంలో సూచనలు ఇస్తున్న అధికారులు

మాకవరపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, సత్ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు సమష్టిగా కృషి చేయాలని ఎంఈవో ప్రసాద్ సూచించారు. గురువారం ఇక్కడి హైస్కూల్‌లో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ సభ్యులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. పాఠశాలల పరిశుభ్రతతో పాటు మధ్యాహ్న భోజన పథకం విజయవంతంగా కొనసాగేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మాకవరపాలెం హైస్కూల్ హెచ్‌ఎం అచ్యుత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక

నర్సీపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఇక్కడ గురువారం ఏకగ్రీవంగా జరిగింది. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డి.నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన మండల శాఖ సమావేశంలో అధ్యక్షుడిగా ఎల్.ఎర్రాపాత్రుడు, కార్యదర్శిగా ఎన్.గోవింద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు.

మూడు వేల లీటర్ల బెల్లం ఊట ధ్వసం

నర్సీపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ధర్మసాగరం గ్రామం శివారులో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన మూడు వేల లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేశామని రూరల్ ఎస్ఐ పి.రాజారావు తెలిపారు. అలాగే, సారా తయారీ సామగ్రిని కూడా ధ్వంసం చేశామని వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్‌గా రమణ



మాకవరపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ఓబీసీ చైర్మన్‌గా బొంతు రమణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృష చేస్తానన్నారు.

పింఛన్ల పంపిణీ తీరుపై గ్రామాల్లో అధికారులు విచారణ



మాకవరపాలెంలో విచారణ జరుపుతున్న ప్రత్యేకాధికారి

కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం చీడిగుమ్మలలో పెన్షనర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని అపరిచిత వ్యక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో సమాచారం అందించిన నేపథ్యంలో వెంటనే స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు చీడిగుమ్మలో కొత్త పెన్షనర్లు 28మంది ఇంటికి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజ్ వెళ్లి విచారణ జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపామని, సదరు నివేదికను పంపనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పింఛన్ల పంపిణీపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మాకవరపాలెం, పైడిపాల, తామరం, పెద్దిపాలెం, రామన్నపాలెం, వెంకయ్యపాలెం, జి.కోడూరు, రాచపల్లి గ్రామాల్లో విచారణ జరుపుతున్నట్టు మండల అధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం పింఛన్ల పంపిణీ ఎలా జరుగుతుందని అని పింఛనర్లను అడిగి తెలుసుకున్నామన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు విలేకరులకు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.



గొలుగొండ మండలం చీడిగుమ్మలో అధికారులు విచారణ

త్వరలో అర్ల-జాజులబంధ రోడ్డు పనులు



రోడ్డును పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డీఈఈ, ఏఈలు

రోలుగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అర్ల నుంచి జాజులబంధ రోడ్డు నిర్మాణ పనులు నెల రోజుల్లో ప్రారంభించనున్నట్టు అల్లూరి జిల్లా చింతపల్లి ట్రైబల్ వెల్ఫేర్ డీఈఈ బి.రఘునాథ్‌నాయుడు, ఏఈ రామకృష్ణ తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు గురువారం వీరు రోలుగుంట మండలం అర్ల నుంచి పిత్రిగెడ్డ వరకు వెళ్లే ఆరు కిలోమీటర్ల రహదారిని పరిశీలించారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.10కోట్ల నిధులను ఉపాధి పథకం నిధుల కింద మంజూరు చేసినట్టు వారు తెలిపారు. అలాగే, పిత్రిగెడ్డ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న జాజులబంధ వరకు కూడా ఈ నిధులతోనే రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. నెల రోజుల్లోనే పనులు ప్రారంభించి గిరిజనులకు కష్టాలు లేకుండా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంటును అడ్డుకుంటాం: సీపీఐ



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

దేవరాపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి , నగరంపాలెం ప్రాంతాల్లో అదాని కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్లాంటును గిరిజనులుతో కలసి అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం హెచ్చరించారు. చింతలపూడి పంచాయతీలో అదానీ కంపెనీ తలపెట్టిన హైడ్రో పవర్ ప్లాంటు నిర్మించనున్న ప్రదేశాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రో పవర్ ప్లాంటు నిర్మిస్తే రైతులకు, విశాఖ వాసుల తాగునీటికి ఆధారమైన రైవాడ జలాశయంతోపాటు పలు గ్రామాలకు తీవ్ర ముప్పు కలుగుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సత్యనారాయణ

చీడికాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):చీడికాడ రెవెన్యూ కార్యాలయం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సత్యనారాయణను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడి తహసీల్దార్ వైవీఎస్ ప్రసాద్ గత నెల 31న పదోన్నతిపై వెళ్లిపోవడంతో ఆ స్థానంలో డీటీని ఇన్‌చార్జిగా నియమించారు.

మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంప్

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

మాడుగుల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సదరం క్యాంపు నిర్వహించారు. గత రెండు వారాలుగా ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు అందుబాటులో లేక క్యాంప్ నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు వైద్య నిపుణుడులేక నిరాశతో వెనుతిరిగే పరిస్థితి నెలకొంది. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో డిసెంబరు 19వ తేదీన కథనం ప్రచురితమైంది. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పందించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆస్పత్రిలో కోటపాడు ఆస్పత్రిలోని వైద్య నిపుణుడు నందకిశోర్ వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. 27మంది దివ్యాంగులు సద్వినియోగం చేసుకున్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

దేవరాపల్లి, జనవరి2 (ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధి మొక్క ఎదుగుదలకు ఉపయోగ పడుతుందని కొండెంపూడికి చెందిన శాస్త్రవేత్తలు రాజకుమార్, సౌజన్య అన్నారు. మండలంలోని కాశీపురంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వేరుశనగ విత్తనాలకు మెనకోజబ్, కార్బండిజమ్ మందుతో విత్తన శుద్ధి చేసి రైతులకు అవగాహన కలిగించారు. మల్టీకే మందును రైతులకు ఉచితంగా అందించారు. ఏవో కాంతమ్మ, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి పాల్గొన్నారు.



చోడవరం: మాట్లాడుతున్న ఎంఈఓ తిరుపతిరావు



కె. కోటపాడులో నిర్వహిస్తున్న సమావేశం

పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు దోహదం

ఎంఈవో తిరుపతిరావు

చోడవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు దోహదపడాలని అధికారులు కోరారు. గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లకు, హెచ్‌ఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని కొత్తూరు బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు తిరుపతిరావు, సింహాచలం మాట్లాడారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు, విధులు, బాధ్యతలు, బాలల హక్కులు-పరిరక్షణ, పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల నిర్వహణ, విధి విధానాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల సామాజిక తనిఖీ, పాశాలల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యల పరిష్కారాలను వివరించారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా కొండలరావు, గంగాధర్, రమేశ్ వ్యవహరించారు. సీఆర్పీలు కేవీఎం నాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశంకర్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ మేనేజ్‌మెంట్ ఛైర్మన్‌లకు గురువారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కె. సత్యనారాయణ మాట్లాడుతూ, పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థులను గుర్తించి రోజూ వారు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని స్కూల్ కమిటీ ఛైర్మన్లను కోరారు. అలాగే డ్రాప్స్ గుర్తించి పాఠశాలల్లో తిరిగి చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 డీవీడీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కె. శ్రీనివాస్, బి. శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరి గాయాలు

రావికమతం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఒక్కరికి తీవ్రంగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై వివరాలివి.. పి.పొన్నవోలుకు చెందిన కర్రి ముసిలినాయుడు టి.అర్జాపురం శివారు గదబపాలెంలో సరుగుడు తోట నరికివేత పనికి వెళ్లారు. పనిముగించుకుని రాత్రి 7 గంటల సమయంలో తిరిగి స్వగ్రామం పొన్నవోలుకు వస్తుండగా మార్గం మధ్యలో అర్జాపురం వాటర్‌ప్లాట్ వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న మేడివాడకు చెందిన జి.శ్రీను వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముసిలినాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ముసిలినాయుడునువిశాఖలోఆస్పత్రిలో చికిత్సపొందుతున్నట్టు ఆయన అన్నయ్య సన్నిబాబు తెలిపారు. దీనిపై కొత్తకోట పోలీసులను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఐవీఆర్ కాల్స్‌కు అందిన ఫిర్యాదులపై విచారణ

రోలుగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సామాజిక ఫించన్ల పంపిణీలో పారదర్శకతపై ప్రభుత్వం మరింత దృష్టి సారిస్తోంది. దీనిలో భాగంగానే ప్రభుత్వం లబ్ధిదారులకు ఐవీఆర్ కాల్స్ ద్వారా ఆరా తీస్తోంది. మండలంలోని 12 పంచాయతీలనుంచి 24 మంది లబ్ధిదారుల నుంచి అందిన ఫిర్యాదులపై ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ నాగమ్మ, ప్రత్యేకాధికారి మనోహర్ గురువారం ఉదయం కలెక్టర్ ఆదేశాలతో ఇంటింటా విచారణ చేపట్టారు. అడ్డసరం, గుండుబాడు, జగ్గంపేట, జానకిరాంపురం, కొండపాలెం, కొవ్వూరు, కుసర్లపూడి, ఎంకేపట్నం, నిండుగొండ, రత్నంపేట, వడ్డిప, శరభవరం గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆయా 24 మంది లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించి నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యం: డీఈవో



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల, జనవరి 2(ఆంధ్ర జ్యోతి): పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చ ర్యలు తీసుకోవాలని డీఈఓ గిడ్డి అప్పారావు నాయు డు ఆదేశించారు. గురువారం మండలంలోని తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బోధన తీరు, స్టడీ అవర్స్ నిర్వహణపై ఆరా తీశారు.హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులతో సమావేశమై ప లు సూచలించారు. ఈ సందర్భంగా డీఈవోను టీచర్లు సన్మానించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత

దేవరాపల్లి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాల ఆదుకుంటామని శ్రీరామ రైతు సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కేవీ రమణ అన్నారు. మండలంలోని పెద గంగవరంలో ఇటీవల మృతి చెందిన 15 కుటుంబాలకు రూ. 5 వేలు చొప్పున చెక్కులను గురువారం అందజేశారు. రైతులు సంక్షేమం కోసం వంద కుటుంబాలతో 2009 ఏర్పాటు చేసిన తమ సంఘం ప్రస్తుతం 200 కుటుంబాలకు చేరినట్టు చెప్పారు. ప్రతి నెలా రూ. 100 చొప్పున పొదుపు చేసి మృతి చెందిన వారి దహన సంస్కారాలకు రూ. 5వేల చొప్పున అందిస్తున్నామన్నారు. సంఘ అధ్యక్షులు రామునాయుడు, అవతారం, గవిరెడ్డి దేమున్నాయుడులున్నారు.

ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి

మాడుగుల రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజేపురం గ్రామసచివాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు బీశెట్టి శ్రీనివాసు మాట్లాడుతూ గ్రామంలో పంట కళ్లాల వద్ద కోతులు బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. పారిశుధ్యం మెరుగుపరచాలని కోరారు. ఇళ్ల నిర్మాణదారులకు సహకారం అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణబాబు, పాలక వర్గ సభ్యులు కోటి అప్పారావు, వెంకటరావు, ఆదిబాబు, దాలిబాబు, హరిబాల తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధ్యమని అప్పలరాజుపురం ఉపసర్పంచ్ కురచా కౌశల్య అన్నారు. గ్రామ సచివాలయ కార్యాలయంలో గురువారం గ్రామసభ జరిగింది. సమస్యలు గుర్తించారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.వీర్రాజు, గ్రామ పెద్దలు కురచా నారాయణమూర్తి, కురచా సురేశ్, సాయిరాం, లక్ష్మీనాయుడు, కాళ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అప్పలరాజుపురంలో నిర్వహిస్తున్న గ్రామసభ

ముషిడిపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ

దేవరాపల్లి, జనవరి2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ముషిడిపల్లిలో రూ. 10 లక్షల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎంపీపీ బుల్లి.లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి.సత్యం, సర్పంచ్ మతల దేముడమ్మ గురువారం భూమి పూజ చేశారు. రోడ్లు, బోర్లు నిర్మించనున్నట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరే. బాబూరావు, వైస్ ఎంపీపీ ఉగ్రూకల.గంగా బవాని, చింతల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరా లక్ష్యం

రావికమతం: ఇంటింటికీ తాగునీటి సరఫరా చేయడమే తన లక్ష్యమని తట్టబంద గ్రామ సర్పంచ్ గోకివాడ రమణ అన్నారు. ఈ మేరకు పంచాయతీ శివారు గ్రామాలైన కశిరెడ్డిపాలెం, బల్జిపాలెంలలో రూ.46 లక్షలతో నిర్మించనున్న తాగు నీటి పథకాల నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జల్‌జీవన్ పథకం ద్వారా ఎల్.ఎన్.పురంలో రూ.33 లక్షలు, బూరుగుపాలెంలో రూ.30 లక్షలు, తట్టబందలో రూ.46 లక్షలు, మొత్తం రూ. 1.9 కోట్లతో రక్షిత పథకాలు నిర్మాణం చేపడుతున్నామన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

కె.కోటపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గొండుపాలెం ఫీడర్‌లో శుక్రవారం సాంకేతిక పనులు నిర్వహిస్తున్నందున పలు గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. గుల్లేపల్లి, చౌడువాడ, గొండుపాలెం, మల్లంపాలెం గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ జిల్లా వైస్ గవర్నర్‌గా శ్రీనివాసరావు

మాడుగుల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వాసవీజాగృతి ఇంటర్నేషనల్ జిల్లా వైస్ గవర్నర్‌గా మాడుగుల గ్రామానికి చెందిన శ్రీనాధు శ్రీనివాసరావుని ఎంపిక య్యారు. అనకాపల్లిలో జరిగిన సమావేశంలో ఆ సంఘం వ్యవస్థాపకుడు తిరువీధి వేణుగోపాల్ శ్రీనివాసరావుని వైస్ గవర్నర్‌గా ఎంపిక చేశారు. మాడుగుల వాసవీ మాడుగుల క్లబ్ ప్రెసిడెంట్‌గా పుట్టా వాసు, కార్యదర్శిగా పాలకుర్తి పద్మ, ట్రెజరర్‌గా పుట్టా స్వాతిలను ఎంపికచేసి ప్రమాణ స్వీకారం చేయించారు.



శ్రీనివాసరావు

కొబ్బరి మొక్కల పెంపకంతో పంచాయతీలకు ఆదాయం

రావికమతం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి మొక్కలు పెంపకం ద్వారా పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని కవ్వగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి అన్నారు.ఈ మేరకు ఉపాధి పథకం ద్వారా పంచాయతీకి మంజూరైన 250 కొబ్బరి మొక్కలను ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో కాశి, టీఏ కొండాజీ, ఎఫ్ఏ వరహాలు, వార్డు మెంబరు ప్రగడ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, UPPADA RAMACHANDRA REDDY (Old Name), S/o. Uppada Satyam, R/o. 5-11-33, Reddy Thungalam, BHPV, Gajuwaka, Visakhapatnam - 530013. Changed my name from UPPADA RAMACHANDRA REDDY (Old Name) to UPPADA RAMA CHANDRA RAO (New Name). Henceforth I am being called as UPPADA RAMA CHANDRA RAO (New Name) for all purposes.
AJV_230778

CHANGE OF NAME

★ I, BEVARA PRASADA RAO (Old Name), S/o. Bevara Satyannarayana, R/o. Plot No.153, 2nd Lane, Laxmi Ganapati Colony, Phoolbagh, Vizianagaram. Changed my name from BEVARA PRASADA RAO (Old Name) to BEVARA VARA PRASADA RAO (New Name). Henceforth I am being called as BEVARA VARA PRASADA RAO (New Name) for all purposes.
AJV_230779

CHANGE OF NAME

★ I, Alivelu Menda, born on 06/09/1983, residing at Door No. 10-50/4, SF-I, H.B. Colony, P.M. Palem, Visakhapatnam Rural- 530041, have changed my name to MENDA RAVANAMMA, born on 21/06/1985, as per affidavit dated 27/12/2024. I shall be known as MENDA RAVANAMMA for all purposes.
AJH-36777

TO-LET

★ 3 BHK Luxary, Semi Furnished Flat of MVV NEELADRI for Rent at Maharanipet, Visakhapatnam. Contact : 7903757988
AJV_205224

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

విదేశీ పర్యాటకుల సందడి


ఒనకఢిల్లీ వారపు సంతలో విదేశీయులు

ముంచంగిపుట్టు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఒడిశా సరిహద్దునున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టు పరిధిలోని ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం విదేశీ పర్యాటకులు సందడి చేశారు. ఇటలీ, జర్మనీ, బ్రెజిల్, అమెరికా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, పోర్చుగల్ తదితర దేశాల నుంచి అధిక సంఖ్యలోవిదేశీ పర్యాటకులు మాచ్‌ఖండ్ జలవిద్యుత్ పరిసరాలను సందర్శించేందుకు వచ్చారు. వారపు సంతకు వచ్చే బొండా, గదబ గిరిజనుల వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారు. సంతలో బొండా జాతీయులు విక్రయించే పలు రకాల వస్తువులను కొనుగోలు చేసుకున్నారు. వారితో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపించారు. విదేశీయులను చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యువత తరలి రావడంతో సందడి నెలకొంది.

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాలల్లో ఈ నెల 3వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఏపీఎస్ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంచంగిపుట్టు సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఆ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. హుకుంపేట మండలం కేవీ అడ్డుమండ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం అడ్డుమండ, సన్యాసమ్మపాలెం, బారాపల్లి, ములియాపుట్టు, కొంతెలి, గడికించుమండ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'పెసా చట్టం ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు'


మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

కొయ్యూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) పెసా చట్టాన్ని ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెడతామని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్, భారత్ ఆదివాసీ పార్టీ అధ్యక్షుడు రాజబాబు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో తమ పార్టీ నేతలతో కలసి మాట్లాడారు. పెసా చట్టం పై అవగాఆహన ఉన్నవారు పెసా కమిటీలో ఉంటే చట్టం సక్రమంగా అమలవుతున్నారు. కా నీ, ఆదివాసీయేతర పార్టీ కబంధ హస్తాలలో చిక్కిన కొంత మంది ఆ దివాసీలు తమ పార్టీ వారు పెసా కమిటీలలో నెగ్గాలనిప్రయత్నాలు సాగిస్తున్నట్టు ఆయన తెలిపారు. భవిష్యత్తులో పైసా చట్టానికి లోబడి గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగాలని, కమిటీలు ఇష్టమెచ్చినట్టు వ్యవహరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తోందని హెచ్చరించారు. గతంలో ఈ విషయం ఎవరు పట్టించుకోలేదని ప్రస్తుతం ఆదివాసీ జేఏసీ, భారత్ ఆదివాసీ పార్టీ రెండు కళ్లతో చూస్తుందని తేడా వస్తే క్రిమినల్ కేసులు పెడతామని రాజబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లోజేఏసీ నేతలు పాడి లోవరాజు, శ్యామల వరలక్ష్మి, మాకాడ బూర్గులయ్య, బూరుగుల వెంకటరావు, రామచంద్రుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: ఎంపీడీవో

ముంచంగిపుట్టు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరుబయట చెత్తను వెయ్యరాదని ఎంపీడీవో శ్రీహర్షసాయి అన్నారు. గురువారం స్థానిక దుకాణాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా దుకాణాల ఆవరణలో చెత్తకుండీలను ఏర్పాటుచేయాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని సూచించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పూజ

ముంచంగిపుట్టు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జోలాపుట్టులో అయ్యప్ప సేవా పీఠంలో గురు స్వామి సూరిబాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడి పూజ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు భజనతోపాటు పలు భక్తి గీతాలను ఆలపించారు. గురు స్వామి సూరిబాబుకు సన్మానించారు.

ప్రకృతి సాగు లాభాదాయకం

డుంబ్రిగుడ: ప్రకృతి వ్యవసాయం సాగు లాభాదాయకమని ఆదివాసీ రైతు సంఘం సెంట్రల్స్ పర్ ఫారెస్ట్రీ ప్రోగ్రాం అధికారిణి నాగమణి అన్నారు. మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్కలో ఆదివాసీ రైతు సామర్థ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వాహించారు. అనంతరం రైతు సంఘాలకు ట్రంకు పెట్టెలు, పనిముట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ నిపుణులు సాయిదుర్గ (హైదరాబాద్) ప్రాజెక్టు సమన్వయకర్త గాసినాయుడు, సంస్థ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో గిరిజనులు మోసపోకూడదు

▸ జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆదేశం


కాఫీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్

జి.మాడుగుల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాఫీ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా కమిటీల ద్వారా అవగాహన కల్పించాలని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని ఆయన గురువారం పర్యటించారు. ముందుగా స్థానిక గోదాం, స్టాక్ పాయింట్, పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన గొడౌన్ భవనం మరమ్మతులకు అంచనా నివేదికను సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.

పెట్రోల్ బంక్ నిర్వహణలో లోపాలపై ఆగ్రహం

పెట్రోల్ బంక్‌లో వినియోగదారులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగితెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పెట్రోల్ తదితర బిల్లులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా డీఎం సందర్శించకపోవడంతో ఆయనపై మండి పడ్డారు. బంక్‌లో సమస్యలు అధిగమించి ఆదాయం వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. అనంతరం సింగర్బ పంచాయతీ ఉబలగరువులో నిర్మించిన కాఫీ కొనుగోలు కేంద్రాన్ని శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. కాఫీ రైతులకు ప్రభుత్వం పెంచిన ధరలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టూరిజం డైరెక్టర్ కిల్లు రమేశ్‌నాయుడు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు,నాయకులు బాకూరు వెంకటరమణ, సాగర సుబ్బారావు, పాండురంగ స్వామి, వి.కొండలరావ, కల్యాణం, చిరంజీవినాయుడు, కేవి.సురేశ్‌కుమార్, డీఎం డి.సింహాచలం, మేనేజర్ కొండబాబు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీను తొలగించాలని వినతి

డుంబ్రిగుడ: గుంటగన్నెల పొదుపు సంఘం ద్వారా నడుస్తున్న డీఆర్ డిపో నిర్వాహణ బాధ్యతలను జీసీసీ ఛైర్మన్ శ్రావణ్ కుమార్‌కు గిరిజనులు వినతి పత్రం అందశారు. ఈ సందర్భంగా టీడీపీ మం డల కార్యదర్శి చిన్నగెన్ను మాట్లాడారు. లక్ష్మిగ్రూపు ద్వారా నడుస్తున్న గుంటగన్నెల డీఆర్‌డీపోలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా ఒడిశా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటా బియ్యంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజనులు ప్రతినెలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత నిర్వాహకులు దురుసుగా సమాధానమిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి పొదుపు సంఘంను ఈ బాధ్యతలనుంచి తొలగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథం, పరుశురాం, గాసి పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుపై నైపుణ్యం పెంచుకోవాలి

▸ ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



మాట్లాడుతున్న అప్పలస్వామి

చింతపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత సేంద్రీయ వ్యవసాయంపై నైపుణ్యం పెంచుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. గురువారం పరిశోధన స్థానంలో కేంద్ర వ్యవసాయశాఖ, సమెతి ఆం ధ్రప్రదేశ్, ఆత్మ సహకారంతో గ్రామీణ యువతకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ గ్రామీణ యువతకు ఆరు రోజుల పాటు స్కిల్ ట్రైనింగ్ ఫర్ రూరల్ యూత్(ఎస్‌టీఆర్‌వై) కోర్సుపై శిక్షణ ఇస్తున్నామన్నారు. నాణ్యమైన అధిక దిగుబడులు సాధనకు పాటించాల్సిన మెలకువలు, ఆధునిక సేద్య పద్ధతులు, అందుబాటులోనున్న యంత్రాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సేంద్రీయ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆర్గానిక్ ధ్రువీకరణ కోసం రైతులు ప్రత్యేక శ్రద్ధతో మూడేళ్ల పాటు సేంద్రీయ పద్ధతిలో పంటలను సాగు చేయాల్సివుంటుందన్నారు. యూబీఐ బ్యాంక్ మేనేజర్ ఎం. శరత్ చంద్ర మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహామండలి సభ్యుడు వండలం బాలయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులకు ఆకర్షితులవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు సమన్వయకర్త డాక్టర్ పి.బాల హుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ కె. బయ్యప్ప రెడ్డి, సందీప్ నాయక్, డాక్టర్ వెంకటేశ్‌బాబు, జోగారావు పాల్గొన్నారు.

అత్యాచార బాధిత కుటుంబానికి న్యాయం కోసం ఆందోళన

జి.మాడుగుల, జనవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ విద్యార్థిని అత్యాచార ఘటన జరిగిన నేపథ్యంలో బాధితురాలి బంధువులు, ప్రజా సంఘాల నాయకులు గురువారం పాఠశాల ఎదుట రోడ్డులో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినికి రక్షణగా ఉండాల్సిన అధికారులు ఆమెపైనే అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బాధతకుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విచారణ చేపట్టి బాధ్యులపై కఠినంగా శిక్షించాలని కోరారు. లేని ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం నాయకులు లతకుమారి, కెజియరాణి, విమల, రవణమ్మ, గిరిజన సమాఖ్య నేత సెగ్గె లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నేత లక్ష్మణ్,గిరిజన సమఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధక్రిష్ణ, సీహెచ్ మత్యరాజు, గోవింద్, గోపాల్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు కనెక్టింగ్ రోడ్లు: కలెక్టర్


సప్పర్లలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్ కుమార్

సీలేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు అనుసంధాన రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ అన్నారు. గురువారం సీపీఐ మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అమ్మవారి ధారకొండ పంచాయతీలో ఆయన పర్యటించారు. సప్పర్ల నుంచి ఏవోబీ సరిహద్దు దుర్గం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు రవాణా కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం కనెక్టింగ్ రహదారులను నిర్మిస్తోందన్నారు. సప్పర్ల దుర్గం రహదారి నిర్మాణం పూర్తయితే, సుమారు 30గ్రామాల ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందన్నారు. ఈ నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ గిరిజనులతో మాట్లాడారు. ఇప్పటికే ఏక్షణంలో కొండచరియలు విరిగిపడతాయోనని భయపడుతున్నామని, తమను సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కా గృహాలు నిర్మించాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. సప్పర్ల గ్రామంలో తాగునీటి సమస్యపై అర్జీని ఇచ్చారు. తాగునీటి సమస్యపై నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రామకృష్ణ, పీఆర్ ఇంజనీర్ జ్యోతిబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ అప్పలసూరి, సర్పంచ్ బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేడు, రేపు పెసా కమిటీ ఎన్నికలపై గ్రామసభలు

అరకులోయ, జనవరి2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని 56 పెసా గ్రామసభలను ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభల ఆధ్వర్యంలో కమిటీల్లో వైస్‌ప్రెసిడెంట్, కార్యదర్శి పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా అధికారులను నియమించినట్టు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో ఓటర్లు పాల్గొవాలని కోరారు.

పాఠశాలల ప్రగతికి కమిటీలు శ్రద్ధ తీసుకోవాలి: డీఈవో


చింతపల్లి: మాట్లాడుతున్న డీఈవోబ్రహ్మాజీరావు


ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహర్షసాయి

చింతపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రగతికి స్కూల్ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో బ్రహ్మాజీరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ నాయకుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలను అభివృద్ధిలో కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి నిధులు సమీకరణలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించాలన్నారు. విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ఆధారంగా భోజనాలు విద్యార్థులకు పెట్టేలా చూడాలన్నారు.కార్యక్రమంలో ఎంఈవో పీవీవీవీ ప్రసాద్, ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, జెడ్పీస్కూల్ హెచ్ఎం అప్పారావు పాల్గొన్నారు.

పెదబయలు: పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ ఛైర్మన్లు కీలకమని ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్ తెలిపారు. గురువారం స్థానిక గురుకుల పాఠశాలలో మండలంలో ఉన్న అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్‌లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌పీలు మాధవరావు, వెంకటేష్, పంతులుబాబు, ఎస్ఆర్‌పీ సింహాచలం శిక్షణ అందించారు.

ఏపీటీఎఫ్ క్యాలండర్ ఆవిష్కరణ

పెదబయలు గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్ ఇతర ఉపాధ్యాయులతో కలసి అంధప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పాఠశాలల అభివృద్ధికి అన్ని వర్గాల వారి సహకారం ఎంతో అవసరమని ఎంపీడీవో శ్రీసాయిహర్ష అన్నారు. పాఠశాల కమిటీ, ప్రతినిధులు ఉపాధ్యాయులతో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల (1),(2)లలో గురువారం విద్యా శాఖ అధికారులుశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో కృష్ణమూర్తి, ఎంపీడీవో శ్రీహర్షసాయి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాల్లో మెనూ పక్కాగా అమలు, పాఠశాలల్లో పర్యవేక్షణ తదితర అంశాల్లో ఎస్ఎంసీ ఛైర్మన్లు పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలు పరిష్కారం


బిల్లాపుట్‌లో మాట్లాడుతున్న టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి

పాడేరురూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వంజంగి త్రినాధరావు నాయుడు అన్నారు. మండలంలోని దేవాపురంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మ్యుటేషన్‌లు, భూ సరిహద్దు సమస్యలు, భూ తగాదాలపై 222 మంది నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు జరగనున్న ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ కూడా భాస్కరరావు, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వోలు ఆర్.సూర్యప్రకాశ్, జె.వెంకటలక్ష్మి, పోలీసు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అరకు పార్లమెంట్ టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి అన్నారు. పోతంగి పంచాయతీ బిల్లపుట్టు గ్రామంలో రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దన్నేరావు, వార్డు సభ్యుడు లక్ష్మణరావు, బూత్ ఇన్‌చార్జి సీతన్న పాల్గొన్నారు.

'సమర్థమైన నేతలను ఎన్నుకోవాలి'

చింతపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెసా కమిటీ కార్యదర్శి, ఉపాధ్యక్షులుగా సమర్థవంతమైన నాయకులను ప్రజలు ఎన్నుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల స్వపరిపాలను పట్టంకడుతూ, కూటమి ప్రభుత్వం పెసా కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఈ కమిటీలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయన్నారు. ఇవి బలంగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైన్నారు. పేసా కమిటీ తీర్మాణంలేకుండా ప్రాజెక్టులు, మైనింగ్ నిర్వహించే అవకాశంలేదన్నారు. ప్రజల పక్షాన పనిచేసే విద్యావంతులైన నాయకులను పెసా కమిటీకి ఎన్నుకోవాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, అప్పారావు, కేశ్వరరావు, అబ్బాయిదొర, రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక


ఎంపికైన మహేశ్

చింతపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మరో విద్యార్థి ఎంపికైనట్టు ప్రినిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. ఈనెల 10 నుంచి 12 వరకు పంజాబ్ గురుకసి విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఇప్పటికే ఇద్దరు విద్యార్థులు ఎంపిక య్యారన్నారు. తాజాగా, కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సీహెచ్ మహేశ్‌ను రెజ్లింగ్ గ్రీకోరోమన్ స్టైల్‌కి ఎంపిక చేసినట్టు నిర్వాహకులు మెయిల్ పంపించారన్నారు. రమేశ్ ఇప్పటికే విశ్వవిద్యాలయం, సౌత్ జోన్ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చారన్నారు. విద్యార్థుల ఎంపికలో కృషి చేసినకోచ్ నూకరాజు, పీడీ శివరామ్‌కుమార్, అధ్యాపకులను అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

పాడేరురూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి వేడుకల్లో భాగంగా డిసెంబరు 22న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బహుమతులందించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గు మేఘనకు (ప్రథమ), బి.లిఖితకు (ద్వితీయ), ఎం.భవ్యకు (తృతీయ) బహుమతులు అందించారు. క్విజ్ పోటీల్లో ముగ్గు మేఘన, జె.మణికుమార్, కె.కీర్తన, ముగ్గు యశ్వంత్, బి.లిఖిత, ఎం.భవ్య, ఎస్‌కే.యాసిన్, వి.నిరీక్షణ్, చిత్రలేఖన పోటీలో ఎస్‌కే యాసిన్, కె.చైతన్య, బి.గౌతమ్‌కు బహుమతులందించారు. కన్సులేషన్ విభాగంలో పి.గిరిచరణ్, ఎస్.ప్రవీణ్‌కుమార్, వి.క్రిష్ణవేణి, ముగ్గు నవ్యశ్రీ, ఎస్.మంజుల, కె.శావ్య, జ్ఞానేశ్వరరావులకు బహుమతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వన్నెపూరి భీంనాయుడు, కేజె.రామారావు, దిలీప్‌కుమార్, కేశవరావు, కేశవ, ప్రసాదరావు, కొండబాబు, రాజేష్, మహేశ్వరి, గంగాభవాని, అరుణ, పుణ్యవతి, వసంతకుమారి పాల్గొన్నారు.

సినిమా షూటింగ్‌లకు ఏజెన్సీ అనుకూలం

సినీ నటుడు సత్యసాయిశ్రీనివాస్


మోదకొండమ్మ సన్నిధిలో శ్రీనివాస్ దంపతులు

పాడేరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని ప్రకృతి అందాలు సినిమాల చిత్రీకరణకు ఎంతో అనుకూలంగా ఉన్నట్లు సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్ అన్నారు. తను వంద సినిమాల్లో నటించిన సందర్భంగా గురువారం ఆయన సతీసమేతంగా స్థానిక మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తను ఉమ్మడి విశాఖప ట్నం జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో జిల్లా అధికారిగా 19 ఏళ్ల సర్వీసు చేశానని, సినిమాలపై ఆసక్తితో 2017 నుంచి సినీ పరిశ్రమకు మారానన్నారు. రెండేళ్ల ఉద్యోగానికి సెలవులు పెట్టి సినిమాల్లో నటించానని, మరిన్ని సినిమాల్లో ఆఫర్లు రావడంతో ఆ తర్వాత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసి పూర్తిగా సినిమాలపై దృష్టికి కేంద్రీకరించానని తెలిపారు.

'సంక్రాంతి వస్తున్నాం' లో కీలక పాత్ర

విక్టరీ వెంకటేశ్ హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంతో రూపొందించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో తనకు ఫుల్‌లెన్త్ రోల్‌లో నటిస్తున్నట్టు సత్య శ్రీనివాస్ తెలిపారు. గత సినిమాలతో పోల్చితే దీనిలో పోలీస్ అధికారిగా చక్కని నటనకు ఆస్కారమున్న పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే, గేమ్‌చేంజర్ సినిమాలోనూ నటించినట్టు చెప్పారు. వంద సినిమాల్లో నటించే అవకాశం దక్కడంతో మోదకొండమ్మను దర్శించుకునేందుకు ఇక్కడికి వచ్చానన్నారు. అలాగే ఈ ఏడాది అక్టోబరులో అరకులోయలో సంక్రాంతికి వస్తున్నాం సినిమా చిత్రీకరణ జరిగిందన్నారు. ఏజెన్సీలో ఎక్కువగా సినిమా షూటింగ్‌లు జరిగేలా, సినీ పరిశ్రమ అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాట్లాడతానని సత్యసాయిశ్రీనివాస్ పేర్కొన్నారు.

కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

గూడెంకొత్తవీధి: కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో బ్రహ్మాజీరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు కిశోరి వికాసంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలు చేయరాదన్నారు. మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పోక్సో చట్టంపై చైతన్యవంతం చేయాలని, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పించాలన్నారు. పోషకాహారం తీసుకోవాలవాలన్నారు. సోషల్ మీడియం, అపరిచిత పరిచయాలు, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై. ఉమామహేశ్వరావు, ఏవో ఇమ్మానుయేలు, ఈవోఆర్‌డీ పాపారావు, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మిదేవి పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం


నిమ్మళ్లపాలెంలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. గురువారం మండలంలో సంకాడ పంచాయతీ నిమ్మళ్లపాలెంలో స్థానిక సర్పంచ్ దేశగిరి నాగులమ్మతో కలిసి రూ. 5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ప్రస్తుతం మండలంలో పలు గ్రామాల్లో మండల పరిషత్, జడ్పీ , పంచాయతీ, ఉపాధి నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ దేవుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మామిడి చంద్రరావు, కార్యదర్శి జ్యోతిరాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పావని పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



శివలింగపురంలో యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఏటీడబ్ల్యూ, ఎంఈవో, తదితరులు

అనంతగిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో గురువారం యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఏటీడబ్ల్యూ కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలజీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోని యూనియన్ మండల అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి మల్లేశ్వరరావు, హెచ్‌ఎంలు విమలకుమారి, మంగమ్మ, స్వరూప, అప్పలస్వామి, శెట్టి రాంబాబు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల నాయకులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎంఈవో సుందరరావు, యూటీఎఫ్ క్యాలండర్‌ను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కన్నయ్య ఆవిష్కరించారు. సంఘటితంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, బాలయ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత అనకాపల్లికి సహకరించండి

» హోల్‌సేల్ ప్లాస్టిక్ వర్తకుల సమావేశంలో జెడ్సీ రమణ


వర్తకులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత అనకాపల్లికి అంతా సహకరించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణ కోరారు. గురువారం తన కార్యాలయంలో హోల్‌సేల్ ప్లాస్టిక్ వర్తకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. 120 మైక్రాన్‌లోపు ప్లాస్టిక్ సంచులను వాడరాదని స్పష్టం చేశారు. అలాగే క్లాత్ రూపంలో ఉన్న రంగుల సంచులు, ఆకుపచ్చ భోజన ప్లేట్లు కూడా వాడరాదన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఆరోగ్యానికి హానికరమన్నారు. పలు కిరాణా దుకాణాల్లో కూడా 120 మైక్రాన్‌లోపు ఉన్న ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే వాటిని నిలిపివేసేలా అధికారులు కూడా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలుచోట్ల తినుబండారాల దుకాణాల్లో నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్న విషయాన్ని హోల్‌సేల్ వర్తకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ విషయంలో ప్లాస్టిక్ హోల్‌సేల్ వర్తకులు, రిటైల్ వర్తకులు అధికారులకు సహకారం అందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో శానిటేషన్ అధికారులు, సిబ్బంది, హోల్‌సేల్ వర్తకులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడితే చర్యలు

» తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరిక

» వేటజంగాలపాలెంలో తవ్వకాలు చేపట్టిన ప్రాంతం పరిశీలన


తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

కొత్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. కుంచంగి గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 84లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు ఆర్ఐ రమేష్, సర్వేయర్ మోహన్, వీఆర్వో సురేష్‌లతో కలిసి తహసీల్దార్ సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతులు లేకుండా ఎటువంటి తవ్వకాలు జరిపినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సమష్టిగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి : ఎంపీపీ


హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ సభ్యుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు వాటి అభివృద్ధికి అంతా కృషి చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తూ అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. బడిఈడు పిల్లలు బడిలో చేర్పించేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ప్రధానంగా చక్కని ఫలితాలు సాధిస్తూ తద్వారా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులంతా మరింత కృషి చేయాలని కోరారు. పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు, రిసోర్స్ పర్సన్లు సీహెచ్.రమేశ్, వై.గోవిందరావు, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆర్డీవో షేక్ ఆయీషాను ప్రజా రాజకీయవేదిక, రైతు స్వరాజ్య వేదిక, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఆమెను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు అప్పులు చేసి పంటలకు పెట్టుబడులు పెట్టారన్నారు. తీరా పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కారణంగా చాలా చోట్ల నష్టపోయారన్నారు. ప్రస్తుతం వారంతా ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారని వివరించారు. పంట నష్టాలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, ఆయా రైతులకు ఆదుకునేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు కనిశెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, కోరిబిల్లి శంకరరావు, కొణతాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ. రెండు కోట్లు మంజూరు


రోడ్డు నిర్మాణానికి భూమిలో సర్పంచ్ ప్రసాదరావు తదితరులు

సబ్బవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ పరిధిలోని సబ్బవరం, గోపాల్‌నగర్, చినగొల్లలపాలెం, గొర్లివానిపాలెం, ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు రెండు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తెలిపారు. స్థానిక గెడ్డం వీధిలో ఎమ్మెల్యే నిధులు రూ.5.7 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి అంతా సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, స్థానిక నాయకులు బర్ల రమణ, గొర్లి కుమార్, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, గెడ్డం రమేశ్, కోన సోమేశ్వరరావు, గెడ్డం రామకృష్ణ, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్చ్.. వారం రోజులుగా ఇంతే..!

» గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న ప్రజా మరుగుదొడ్లకు తాళం

» ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వివిధ పనులపై పట్టణానికి వచ్చిన ప్రజలు

» ఫిర్యాదు చేసినా జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని పలువురు ఆగ్రహం



గేటుకు తాళాలు వేసి ఉన్న సంతోషిమాత ఆలయం వద్ద గల ప్రజా మరుగుదొడ్లు

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద ఉన్న ప్రజా మరుగుదొడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. సుమారు వారం రోజులుగా ఇవి మూతపడినా పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న ఈ రెండు మరుగుదొడ్లను రోజూ వందల మంది వినియోగించుకునేవారు. చుట్టుపక్కల వీధులతో పాటు పరవాడ, తోటాడ, గవర్ల అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వారు అనకాపల్లి వచ్చినప్పుడు అత్యవసర సమయాల్లో వారికి అందుబాటులో ఉండేవి. అయితే వారం రోజులుగా వీటికి తాళాలు వేసి ఉండడంతో స్థానిక మహిళలు, పురుషులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు మరీ దారుణంగా ఉన్నాయి. నిత్యం తెల్లవారుజాము ఆరు గంటల నుంచి ఎప్పుడూ ఇక్కడ రద్దీగా ఉండేది. ఈ మరుగుదొడ్లకు వాటర్ సరఫరా చేసేందుకు ఉపయోగపడే మోటార్ మరమ్మతులకు గురికావడంతో నిరుపయోగంగా మారాయని అంటున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. సంతోషిమాత ఆలయం, చదరం నూకయ్య గారివీధి, కొణతాల జగ్గప్పలస్వామి వీధి, దిబ్బవీధి, యల్లపువీధి, గంగిరేవిచెట్టు తదితర ప్రాంతాల్లోని ఇళ్లలో మరుగుదొడ్లు లేని పలువురు దూర ప్రాంతాలకు పరుగుతీయాల్సి వస్తోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకు రావాల్సిందిగా ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



నిత్యం ఇదే మరుగుదొడ్లకు వచ్చేవారం. వారం రోజులుగా తలుపులకు తాళాలు వేసి ఉండడంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇవి అందుబాటులోకి వచ్చి ఉంటాయని గురువారం వచ్చి చూసినా తాళాలే కనిపించాయి. ఇంత చిన్న సమస్య పట్ల కూడా అధికారులు అంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా.. తక్షణమే మా పరిస్థితిని అర్థం చేసుకుని మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకు రావాలి

- షేక్ రంజాన్, గవరపాలెం

అందుబాటులోకి తీసుకువస్తా



మరుగుదొడ్లు మూసి వేయడంపై అధికారులతో చర్చిస్తాం. ఎందుకు మూసి వేయాల్సి వచ్చిందో తెలుసుకుంటాం. ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- బీవీ రమణ, జోనల్ కమిషనర్

తానాంలో నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం

» భారీ సంఖ్యలో హాజరైన భక్తజనం » ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జరుగుతున్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

పరవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తానాం గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఇంటింటా గోవిందుడు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పాజిటివ్ పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. కల్యాణోత్సవంలో 150 జంటలు కూర్చొన్నాయి. ప్రధానార్చకులు పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత శ్రీనివాసుడ్ని గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో కోలాటాలు, మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగమ్మ, పద్మావతి వేషధారణలతో ప్రదర్శించిన నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కల్యాణం ముగిసిన అనంతరం భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, సర్పంచ్ కన్నూరు దేవి, ఎంపీటీసీ రొంగలి సుజాత, స్థానిక నాయకులు వర్రి వసంతరావు, పైలా కృష్ణారావు, పైలా చంద్ర, పాజిటివ్ పీపుల్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో తప్పిదాల వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు

» ఆరిపాక రెవెన్యూ సదస్సులో పలు పార్టీల నాయకులు ఆగ్రహం

» భూముల సర్వేతో పాటు జగనన్న కాలనీ లే-అవుట్లపై దర్యాప్తు జరపాలని డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావు

సబ్బవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరిపాక గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆ శాఖ సేవల పట్ల స్థానిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.అప్పారావు ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటైంది. భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు దోహదపడతాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకుడు ఆడారి నాగరాజు, జనసేన పార్టీ నాయకుడు చిన్నరాజు తదితరులు మాట్లాడుతూ చిన్న పనికి కూడా కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా పనులు జరగడం లేదని వాపోయారు. గత రీ సర్వేలో పొరపాట్లు తలెత్తడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలకు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. గత వైసీపీ హయాంలో పోలవరం కాలువ భూ సేకరణ జరిగిందని, ఆరిపాకలో సుమారు 90 ఎకరాలు తీసుకున్నట్టు ప్రకటించారని తెలిపారన్నారు. అయితే ఎవరి భూమి ఎంత తీసుకున్నారో ఆ వివరాలు నేటికీ వెల్లడించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, వైసీపీ హయాంలో ఆరిపాకలో అభివృద్ధి చేసిన లే-అవుట్లు అన్నింటిపైన దర్యాప్తు చేపట్టి, అర్హులకు ఇళ్ల స్థలాలు దక్కేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొంత మంది బడాబాబులు భూములు కొని, ప్రభుత్వ నిధులతో రోడ్లు వేసుకున్నారని మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావు ఆరోపించారు. అంతేకాకుండా ప్రజలు ఆ మార్గంలో వెళ్లకుండా ఫెన్సింగ్‌లు వేస్తున్నారన్నారు. అధికారులు దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ పోల వరం కాలువ సర్వే మరలా చేపట్టడం జరుగుతుందని, రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మార్చిలో రెండో విడత సర్వే చేపడతామని చెప్పారు. అలాగే, జగనన్న కాలనీ లే-అవుట్లపై దర్యాప్తు జరిపి, అక్రమాలు జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, రీ సర్వే డీటీ గణపతిరావు, సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేశ్‌రాజ్, శరగడం రాము, వెంకట్, శ్రీను, నాగేశ్, బాలాజీ, వీఆర్వో అప్పలరాజు, సర్వేయర్లు రాంబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు కూడలిలో వాహనాల తనిఖీ


వాహనదారులకు జరిమానా విధిస్తున్న మైన్స్ అధికారులు

కొత్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరు కూడలిలో జీఎస్టీ, మైన్స్ అధికారులు పలు వాహనాలను గురువారం తనిఖీ చేశారు. కూండ్రం, కుంచంగి, జంగాలపాలెం గ్రామాల మీదుగా ముడి సరకు తీసుకొస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. జీఎస్టీ డిప్యూటీ ఏసీ ఉమా మహేష్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి బిల్లులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు. అదే విధంగా గ్రావెల్, మెటల్ తరలిస్తున్న లారీల్లో బిల్లులు లేని వాటికి మైన్స్ ఆర్ఐ బండారు శ్రీనివాసరావు జరిమానా విధించారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి రేపు

పరవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : అంధుల పితామహుడు లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ వేడుకకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని అంధుల సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.అర్జునరావు తెలిపారు.

చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

కశింకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుచ్చెయ్యపేట, కొత్తపల్లి, పేరంటాలపాలెం గ్రామాల్లో నాలుగు వందల మంది మహిళలు, వృద్ధులు, వితంతువులకు గురువారం కూటమి నాయకులు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

మద్యం బాటిళ్లతో పట్టుబడిన మహిళపై కేసు

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మద్యం బాటిళ్లతో పట్టుబడిన మహిళపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన యర్రవరపు రాము అనే మహిళ గురువారం పట్టణంలో పది మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి స్వగ్రామానికి తీసు కువెళ్తుందన్నారు. సుంకరమెట్ట జంక్షన్ వద్ద అను మానం వచ్చి ఆమెను తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు పట్టుబడినట్టు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని, ఆమెపై కేసు నమోదు చేశామన్నారు.

సదరం ధ్రువ పత్రాల తనిఖీకి షెడ్యూల్ రూపొందించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్


కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సదరం ధ్రువ పత్రాల తనిఖీకి షెడ్యూల్ రూపొందించాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అనకాపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కృష్ణబాబు ఆదేశించిన అంశాలకు సంబంధించి జిల్లా వైద్యాధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను మొదటి దశలో పరిశీలించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆమె ఆదేశించారు. సదరం ధ్రువపత్రాల ద్వారా అనేక మంది అనర్హులు పెన్షన్స్ పొందుతున్నట్టుగా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహించాలన్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందిన వారిని తొలగించాలన్నారు. సదరం ద్వారా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. అనర్హులుంటే వారి వివరాలను తక్షణమే వైద్యాధికారులు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి తదితరులు పాల్గొన్నారు.

5న మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మిక రంగ సదస్సు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈనెల ఐదో తేదీన జరగనున్న మోటారు ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ చట్టం వల్ల రానున్న రోజుల్లో డ్రైవర్ల వృత్తి ప్రమాదంలోకి పడే అవకాశముందన్నారు. కొత్త చట్టం వల్ల మోటారు కార్మికుల సెక్షన్ కఠినతరం చేశారన్నారు. పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్లు వెడల్పు లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం తదితర కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రమాదాలకు డ్రైవర్‌ని కారణం చేస్తూ తెచ్చిన చట్టం దారుణమన్నారు. వీటిన్నింటిపై ఐదో తేదీన జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పలకా సత్యనారాయణ, మోటార్ కార్మికులు పాల్గొన్నారు.

'భూముల విలువ పెంచవద్దు'

కొత్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భూముల విలువ పెంచాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ఇప్పటికే భూములు కొనేనాథులు కరువయ్యారని, ఈ తరుణంలో ఇంకా ధరలు పెంచితే రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు తగ్గిపోతాయని వివరించారు. దీనివల్ల ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం తగ్గిపోతుందన్నారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీవోఏల కార్యవర్గం ఏర్పాటు

పరవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా వీవోఏల మండల నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. అధ్యక్షురాలిగా ఎస్.పైడిలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా వి.ఇందుమతి, గౌరవాధ్యక్షురాలిగా ఎం.ఉమామహేశ్వరి ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎస్.వెంకటలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా కూండ్రపు అమ్మాజీ, కోశాధికారిగా గొర్లె వరలక్ష్మి, గౌరవ సలహాదారునిగా పోతల రమాదేవి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పుష్పలను ఎన్నుకున్నారు. వీఓఏల సమస్యలపై అందరం కలిసికట్టుగా పోరాడుతామని అధ్యక్షురాలు పైడిలక్ష్మి తెలిపారు.

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, UPPADA RAMACHANDRA REDDY (Old Name), S/o. Uppada Satyam, R/o. 5-11-33, Reddy Thungalam, BHPV, Gajuwaka, Visakhapatnam - 530013. Changed my name from UPPADA RAMACHANDRA REDDY (Old Name) to UPPADA RAMA CHANDRA RAO (New Name). Henceforth I am being called as UPPADA RAMA CHANDRA RAO (New Name) for all purposes.
AJV_230778

CHANGE OF NAME

★ I, BEVARA PRASADA RAO (Old Name), S/o. Bevara Satyannarayana, R/o. Plot No.153, 2nd Lane, Laxmi Ganapati Colony, Phoolbagh, Vizianagaram. Changed my name from BEVARA PRASADA RAO (Old Name) to BEVARA VARA PRASADA RAO (New Name). Henceforth I am being called as BEVARA VARA PRASADA RAO (New Name) for all purposes.
AJV_230779

CHANGE OF NAME

★ I, Alivelu Menda, born on 06/09/1983, residing at Door No. 10-50/4, SF-I, H.B. Colony, P.M. Palem, Visakhapatnam Rural- 530041, have changed my name to MENDA RAVANAMMA, born on 21/06/1985, as per affidavit dated 27/12/2024. I shall be known as MENDA RAVANAMMA for all purposes.
AJH-36777

TO-LET

★ 3 BHK Luxary, Semi Furnished Flat of MVV NEELADRI for Rent at Maharanipet, Visakhapatnam. Contact : 7903757988
AJV_205224

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093

అబ్బురపరిచిన విన్యాసాలు



ఆపదలో ఉన్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్

» ఆద్యంతం ఆకట్టుకున్న లేజర్ షో

సాగర తీరంలో తూర్పు నౌకాదళం పూర్తిస్థాయి సాహస విన్యాసాల ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ నెల 4న జరిగే విన్యాసాలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకు గురువారం సాయంత్రం అన్ని రకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఎయిర్ జెట్లు, హెలికాప్టర్లు, కమాండోల ప్రదర్శనలు అలరించాయి. ముఖ్యంగా చీకటి పడిన తరువాత ఏర్పాటు చేసిన లేజర్ షో, డ్రోన్ల ప్రదర్శన సందర్శకులను కట్టిపడేసింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సాగర తీరంలో యుద్ధ ట్యాంకుల ప్రదర్శన



యుద్ధ విమానాల విన్యాసం





తుపాకులతో నేవీ సిబ్బంది కవాతు



సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షిస్తున్న నేవీ హెలికాప్టర్



డ్రోన్లతో నౌకా ప్రదర్శన



నేవీ విన్యాసాలను తిలకిస్తున్న ప్రజలు



కాగడాల తుపాకులతో నావికుల కవాతు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌రోడ్డులోని చేపల బజార్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపారు. దీనికి సంబంధించి గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. విజయవాడ ప్రాంతానికి చెందిన గోడిక్కి దారు(58) స్థానిక కోట్నీవీధిలో నివాసముంటూ మసాలా సామాన్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం చేపల బజార్ సమీపంలో అతనిని వ్యాన్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

వస్త్ర దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

అచ్యుతాపురం రూరల్, జనవరి 2, (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం జంక్షన్‌లో గల వస్త్ర దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని గురువారం అరెస్టు చేశామని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించిన వివ రాలను గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా నర్సరావుపేటలో లేనగర్ పెద్ద చెరువుకు చెందిన ఉప్పతల సత్యనారాయణ(31), పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పాకలపాడుకు చెందిన తన్నీరు కల్యాణి(38) మధ్య వివాహేతర సంబంధం ఉంది. వీరిద్దరూ అచ్యుతాపురం జంక్షన్‌లో గల సాయిశ్రీ క్లాత్ షోరూమ్‌కి కొనుగోలుదారులుగా వచ్చారు. షాపు యజమాని బైపిరెడ్డి లక్ష్మి వద్దకు వచ్చి తమ వద్ద ఉన్న ఒక గోల్డు కాయిన్ ఆమెకు చూపించి తమ ఇంట్లో వివాహం ఉందని అమ్మి పెట్టమని నమ్మబలికారు. పది రోజుల పాటు వారితో మంచిగా మాట్లాడుతూ రూ.80 వేలు ఖరీదైన దుస్తులను కల్యాణి తీసుకుపోగా, యజమానురాలిని ఏమార్చి షాపు సొరుగులో ఉన్న రూ.2.8 లక్షలను సత్యనారాయణ కాజేశాడు. తాను మోసపోయాయని షాపు యజమాని గుర్తించి గత నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిద్దర్నీ గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో పోలీసులు పట్టుకున్నారు. విచారణ జరపగా చోరీ విషయం బయట పడింది. వారి గురించి ఎంక్వయిరీ జరిపించగా సత్యనారాయణపై రౌడీ షీట్ ఉందని, వీరిద్దరి పేరున పిఠాపురంలో మరో కేసు ఉందని, వీరిని సంబంధిత జిల్లాకు పంపించనున్నట్టు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. వారిద్దర్నీ చాకచక్యంగా పట్టుకున్న సీఐ నమ్మి గణేశ్, ఎస్ఐ కె.సుధాకర్, హెచ్‌సీ మల్లేశ్వరరావు, కానిస్టేబుల్ బంగార్రాజును డీఎస్పీ అభినందించారు.

110 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



పట్టుకున్న గంజాయితో సీఐ రామకృష్ణ, ఎస్ఐ రమేశ్

ఎస్.రాయవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో పోలీసులు గురువారం 110 కిలోల గంజాయితోపాటు ఇద్దరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి నక్కపల్లి సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా వున్నాయి. నక్కపల్లి మండలం వేంపాడు హైవే టోల్‌గేటు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అడ్డరోడ్డు వైపు నుంచి తుని వైపు వెళుతున్న ఒక కారు.. పోలీసులను చూసి వెనక్కు మళ్లించి అడ్డరోడ్డు సమీపంలో ఉన్న లేఅవుట్‌లోకి తీసుకెళ్లి ఆపారు. దీంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫోన్ చేసి చెప్పారు. కోటవురట్ల ఎస్ఐ రమేశ్, సిబ్బందితో ఇక్కడకు వచ్చి కారును పరిశీలించారు. లోపల వున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించగా, తమది రాజస్థాన్ రాష్ట్రమని చెప్పారు. అయితే కారు నంబరు ఏపీకి చెందినది కావడంతో అనుమానం వచ్చిన ఎస్ఐ రమేశ్.. కారులో తనిఖీ చేశారు. దీంతో రాజస్థాన్ రిజిస్ట్రేషన్ వున్న నంబరు ప్లేట్ లభ్యమైంది. దీంతో అనుమానం మరింత పెరిగి డిక్కీలో తనిఖీ చేయగా 110 కిలోల గంజాయి కనిపించింది. వీరిని అదుపులోకి తీసుకుని గంజాయితోపాటు కారును సీజ్ చేశారు. ఒడిశాలోని కొత్తంగి గ్రామంలో గంజాయి కొనుగోలు చేసి రాజస్థాన్ తరలిస్తున్నట్టు నిందితులు రతన్‌లాల్ నాయక్, చందు లోహర్ చెప్పారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

అల్లూరి విగ్రహం ధ్వంసంపై కేసు నమోదు

ఎస్.రాయవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగరాజుపాలెం గ్రామంలో ధ్వంసమైన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గురువారం నక్కపల్లి సర్కిల్ సీఐ రామకృష్ణ పరిశీలించారు. ఈ గ్రామంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానికులతో మాట్లాడారు. అల్లూరి విగ్రహ ధ్వంసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. గ్రామంలో ఉన్న సీసీ ఫుటేజీ ద్వారా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు.

సీఎం చంద్రబాబు రాక రేపు

విశాఖపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేవీ డేలో పాల్గొనేందుకు నాలుగో తేదీన నగరానికి రానున్నారు. శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో బయలుదేరి 3.40 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి 4.15 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. 6.10 గంటల వరకూ నేవీ డే కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి 6.15 గంటలకు బయలుదేరి 6.50 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వెళతారు.

తాగునీటి పనులకు రూ.80 కోట్లు

» జడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఉమ్మడి విశాఖ జిల్లాలకు రూ.80 కోట్లు మంజూరు చేసిందని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. గురువారం ఇక్కడ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 15 ఆర్థిక సంఘం నుంచి విడుదల అయ్యే ఈ నిధులతో గ్రామాల్లో తాగునీటి వనరులకు సంబంధించి మరమ్మతు, నిర్వహణ పనులతోపాటు అవసరమైనచోట కొత్తగా బోర్లు వేస్తారని చెప్పారు. సమావేశంలో ఏవో శివరామప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.శివకృష్ణ, ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ హరణి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఎన్నికల్లో కూటమి ఘన విజయంసాధించడం, నారా లోకేశ్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుకు చర్యలుచేపట్టారు. 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం' పేరుతో ఇంటర్ విద్యార్థులకు ఈ నెల నాలుగో తేదీ నుంచి మధ్యాహ్న భోజనం అందుబాటులోకి వస్తున్నది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట (ఏఎల్‌పురం)లో, హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేటలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ప్లస్ 2 స్కూళ్లలో కూడా ఇంటర్ విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేస్తారు. వంట చేసే బాధ్యతను సమీపంలోని ఉన్నత పాఠశాల భోజనం పథకం నిర్వాహకులకు అప్పగించారు. అక్కడే వంట చేసి, భోజనాన్ని కళాశాలలకు తీసుకువచ్చి విద్యార్థులకు వడ్డిస్తారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్లస్ 2 పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు దాదాపు ఆరు వేల మంది వున్నారు. ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి సుజాత ఆధ్వర్యంలో ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశారు. విద్యార్థులు భోజనం చేసేందుకు అవసరమైన పళ్లాలు, గ్లాసులను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది.

తాండవ అత్యవసర పనులకు రూ.2.1 కోట్లు మంజూరు

... 5వ పేజీ తరువాయి

గురించి స్థానిక సిబ్బందిని ఆరా తీశారు. రిజర్వాయర్ ఆనకట్ట, స్పిల్‌వే గేట్లు వద్ద హైడ్రాలిక్ మెయింటెనన్స్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని ఈఈ బాలసూర్యం ఆదేశించారు. దీనివల్ల రిజర్వాయర్ కింద ఎంత విస్తీర్ణంలో వరిసాగు అవుతుందో తెలుస్తుందన్నారు. తాండవలో నీటినిల్వల వివరాలు తెలిపే అక్షరాలు, గీతలు కనిపించడం లేదని, వెంటనే పెయింట్‌తో వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. వీరి వెంట తాండవ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఎం.జోగిబాబు, తాండవ డీఈఈ అనురాధ, ఏఈలు శ్యామ్, నాగబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు కాశపు నూకరాజు, మరిడేశ్వరరావు, సత్యనారాయణ, కశింకోట గోవిందరావు తదితరులు వున్నారు.

పిల్లలు లేరని మనోవ్యథతో దంపతుల ఆత్మహత్య

పెందుర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.అయితే ఆర్థిక సమస్యలకు తోడు వివాహమై ఆరేళ్లు అయినా సంతానం కలగలేదనే మనోవ్యథతో ఆత్మహత్య చేసుకున్నారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం కృష్ణరాయపురంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన డబ్బీరు సంతోష్‌కుమార్ (35), విశాఖ జిల్లా గాజువాకకు చెందిన సంతోషిశ్రీ (28) ఆరేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. జీవనోపాధి కోసం దంపతులిద్దరూ కృష్ణరాయపురంలోని జీవన్ వైద్యశాలకు చెందిన మెడికల్ స్టోర్స్‌లో పనిచేస్తున్నారు. అక్కడకు సమీపంలో గల బాలాజీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇదిలావుండగా గాజువాకలో ఉంటున్న సంతోషిశ్రీ తండ్రి గురువారం ఉదయం కుమార్తె సెల్‌కు కాల్ చేశారు. ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ సతీశ్‌కుమార్, ఎస్ఐ అసిరి తాతలు సిబ్బందితో సంతోష్‌కుమార్ దంపతులు నివాసం ఉంటున్న ఇంటికి చేరుకున్నారు. తలుపులు తట్టినా తీయకపోవడంతో పగులకొట్టి లోనికి ప్రవేశించారు. వంట గదిలో సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు భార్యభర్త ఉరి వేసుకుని కనిపించారు. మృతదేహాలను కిందకు దింపించి అనంతరం పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సతీశ్‌కుమార్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుల బంధువులను విచారించారు. పెళ్లై ఆరేళ్లవుతున్నా సంతానం కలగలేదని తరచూ మథనపడుతుండేవారని పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడం, బంధువులు దూరం పెట్టడం వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. వారిద్దరి సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీఎస్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరి తాత కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రధాని రోడ్‌షో

... 5వ పేజీ తరువాయి

వెళ్లేందుకు సభా వేదికకు సమీపంలో ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మరో మైదానంలో మూడు హెలిప్యాడ్‌లు సిద్ధంచేస్తున్నారు.

ముగ్గురు మంత్రులతో కమిటీ

ప్రధాని సభ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ముగ్గురు మంత్రులతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. కమిటీలో ఉన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధాని పర్యటనపై గురువారం అధికారులతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సమీక్ష నిర్వహించారు. సభ విజయవంతం కోసం 42 కమిటీలు వేశారు. ఎయిర్‌పోర్టులో ప్రధాని దిగినప్పటి నుంచి తిరిగి వెళ్లేంత వరకూ ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకునే బాధ్యతను ఈ కమిటీలకు అప్పగించారు. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఐఏఎస్ అధికారులు, సీనియర్ ఆర్డీవోలు, పోలీస్ అధికారులను ఈ కమిటీల్లో నియమించారు.

కమిషనర్‌పై చైర్‌పర్సన్ ఫిర్యాదు

... 5వ పేజీ తరువాయి

కౌన్సిలర్లకు అజెండా పంపించామని, అయితే దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా సమావేశాన్ని వాయిదా వేయాలని కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా చెప్పానన్నారు. కానీ ఆయన సమావేశాన్ని వాయిదా వేయకుండగా, 31వ తేదీ ఉదయం 11 గంటలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడుఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేస్తారంటూ ఉదయం 10 గంటలకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. అంతేకాకుండా కౌన్సిల్ సమావేశాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించారని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.





చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574